తెలుగు దిన పత్రిక
http://aksharagalam.com
అక్షరగళం
నిజం..నిర్భయంగా
హైదరాబాద్ | గురువారం | 05-02-2026 | సంపుటి-03 | సంచిక-240 | పేజీలు - 08 | వెల:3/–

అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ

అక్షరగళం, ఖమ్మం,ఫిబ్రవరి 4:

తెలంగాణ లో ఇందిరమ్మ ఇళ్ల కోసం ఎదురుచూస్తున్న వారికి రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. ఇప్పటికే 4.5 లక్షల ఇళ్లు మంజూరు చేయగా, రెండో జాబితా పై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ కీలక ప్రకటన చేశారు. ఖమ్మం జిల్లా ఏదులాపురం మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతూ.. త్వరలో రెండో విడత లబ్దిదారుల జాబితా విడుదల చేయనున్నట్లు తెలిపారు. అర్హులైన వారందరికీ ఈ విడతలో ఇళ్లు మంజూరు చేస్తామని అన్నారు. రాజకీయాలను పక్కనపెట్టి పేదల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నామని మంత్రి తెలిపారు.ప్రభుత్వం పేదల సొంతింటి కలను నిజం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఖాళీ స్థలం ఉండి ఇల్లు నిర్మించే పేదలకు ప్రభుత్వం రూ.5 లక్షల ఆర్థిక సాయం అందిస్తోంది. మొత్తం 4 విడతల్లో లబ్దిదారుల ఖాతాల్లో ఆ మొత్తం నిధులు జమ చేస్తున్నారు. ఇప్పటికే పలు జిల్లాల్లో పేదలు ఇంటి నిర్మాణ పనులు మొదలు పెట్టారు. మరికొన్ని చోట్ల ఇళ్ల నిర్మాణాలు సైతం పూర్తయ్యాయి.

తెలంగాణ మిర్చి రైతులకు గుడ్ న్యూస్

ఎనుమాముల మార్కెట్‌లో భారీగా పెరిగిన ధరలు

దేశీ మిర్చి క్వింటా 41,200 రూపాయలకు అమ్మకం

అక్షరగళం, వరంగల్,ఫిబ్రవరి 4:

తెలంగాణలో మిర్చి ధరలు గణనీయంగా పెరుగుతున్నాయి, రైతులకు ఆశాజనకంగా మారాయి. వరంగల్ జిల్లా ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో దేశీ మిర్చి క్వింటా 41,200 రూపాయలకు, ఎల్లో మిర్చి క్వింటా 44,000 రూపాయలకు అమ్ముడయ్యింది. వండర్ హాట్ మిర్చి ధర ఒక్క రోజులో 5,000 రూపాయలు పెరిగి క్వింటా 37,100కి చేరింది. అంతర్జాతీయ డిమాండ్ పెరుగుదల, ఇతర రాష్ట్రాల్లో ఉత్పత్తి తగ్గడం ఈ ధరల పెరుగుదలకు ప్రధాన కారణమని వ్యాపారులు తెలిపారు. గత కొన్ని సంవత్సరాలుగా తక్కువ ధరల కారణంగా బాధపడ్డ రైతులకు ఈ పరిస్థితి పెద్ద

మిగతా 2లో

మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌నే గెలిపించండి

సన్నబియ్యం తీసుకున్న వారంతా ఓటేయాలి

మున్సిపల్ ఎన్నికల తరవాత రైతుభరోసా

రైతులకు గిట్టుబాటు ధరతో పాటు రూ.500 బోనస్ ఇస్తున్నాం

తెలంగాణ జాతిపిత ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ తల్లి మన సోనియమ్మ

మిర్యాలగూడ ప్రచారంలో సీఎం రేవంత్ రెడ్డి

అక్షరగళం, మిర్యాలగూడ,ఫిబ్రవరి 4:

రాష్ట్రంలో జరిగిన అభివృద్ధిని చూసి మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు తీర్పు ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలి. ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఎదురే లేదు.. విజయాన్ని అడ్డుకోలేరని అన్నారు. మిర్యాలగూడ మండలం గూడూరులో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్‌కు శంకుస్థాపన చేసిన అనంతరం ఏర్పాటు చేసిన 'ప్రజా పాలన ' ప్రజా విజయోత్సవ' సభలో సీఎం ప్రసంగించారు. రేషన్ కార్డుల కోసం గతంలో పదేళ్ల పాటు ఎదురుచూడాల్సిన పరిస్థితి. ప్రస్తుతం రాష్ట్రంలో 3.17 కోట్ల మందికి 6 కిలోల చొప్పున సన్న బియ్యం ఇస్తున్నాం. సన్న బియ్యం వచ్చిన వారు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని పిలుపునిచ్చారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేస్తున్న అభివృద్ధి,

మిగతా 2లో

తెలుగు చిత్ర పరిశ్రమకు పెద్దపీట

సినీ పరిశ్రమ కేంద్రంగా హైదరాబాద్

అన్ని భాషల వారు తరలివచ్చినా ప్రోత్సాహం

ఉగాది రోజు గద్దర్ అవార్డుల ప్రదానం

మీడియాతో డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క

అక్షరగళం, హైదరాబాద్,ఫిబ్రవరి 4:

తెలుగు సినీ పరిశ్రమకు తెలంగాణ ప్రభుత్వం పూర్తి ప్రాధాన్యత ఇస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. బుధవారం సచివాలయంలో గద్దర్ అవార్డుల జ్యూరీ సభ్యులతో డిప్యూటీ సీఎం కీలక సమావేశం నిర్వహించారు. హైదరాబాద్‌ను ఫిల్మ్ ఇండస్ట్రీకి కేంద్రంగా చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. అన్ని భాషల సినీ పరిశ్రమలు ఇక్కడికి విస్తరించేలా అనుకూల వాతావరణం కల్పిస్తామన్నారు. దీని ద్వారా సినీ రంగంలో యువత, టెక్నీషియన్లకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. సినీ ప్రపంచ మార్కెట్‌కు హైదరాబాద్ కేంద్రంగా మారుతుందని వెల్లడించారు. కళల ద్వారా సమాజానికి తన జీవితాన్ని అర్పించిన మహానుభావుడు ప్రజా గాయకుడు గద్దర్ అని అన్నారు. అందుకే గద్దర్ పేరు మీద సినిమా అవార్డులను ప్రారంభించి

మిగతా 2లో

తెలంగాణ కోసం ఏనాడైనా రేవంత్ పోరాడారా?

మాజీమంత్రి హరీష్ రావు ప్రశ్న

అక్షరగళం, మెదక్,ఫిబ్రవరి 4:

తెలంగాణ కోసం తాము మంత్రి పదవులు త్యాగం చేశామని.. సీఎం రేవంత్‌రెడ్డి ఎప్పుడైనా రాష్ట్రం కోసం పోరాడారా? అని భారత రాష్ట్రసమితి ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు

మిగతా 2లో

పవన్ ఆంధ్రా రాజకీయాలు చూసుకో

తెలంగాణను అవమానించిన నీకు ఇక్కడేం పని

టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ ఘాటుగా వ్యాఖ్యలు

అక్షరగళం, హైదరాబాద్,ఫిబ్రవరి 4:

పవన్ ఒక ఆంధ్ర నాయకుడని, ఆయన తెలంగాణ వ్యతిరేకి అని టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ ఘాటుగా వ్యాఖ్యానించారు.ఈ మేరకు పవన్ కల్యాణ్‌పై

మిగతా 2లో

కేఎల్ఎన్ఆర్ ఇన్ఫా సీఎం రేవంత్ రెడ్డి బినామీ

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆరోపణలు

అక్షరగళం, హైదరాబాద్,ఫిబ్రవరి 4:

తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆరోపణలు చేశారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ స్కాములను ఒక్కొక్కటిగా బయటపెడుతున్నామని, మూసీ నది పేరిట లక్షల కోట్ల దోపిడీని బీఆర్ఎస్ అడ్డుకుందని అన్నారు. లగచర్లలో అల్లుడి కంపెనీ కోసం గిరిజనుల భూములు లాక్కోవాలని చూస్తే బీఆరఎస్ అడ్డుకుందని, హిల్ట్ పాలసీలో లక్షల కోట్ల కుంభకోణాన్ని బీఆరఎస్ బయటపెట్టిందని చెప్పారు. అలాగే, సింగరేణి అవినీతినీ తమ

మిగతా 2లో

ముగ్గురు మంత్రులకు ప్రతిష్టాత్మకం ఖమ్మం

ప్రచారంలో ముందున్న మంత్రి పొంగులేటి

విభేదాలు రాకుండా జగ్రత్త పడ్డ అమాత్యులు

అక్షరగళం, ఖమ్మం,ఫిబ్రవరి4:

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మున్సిపల్ ఎన్నికలు ముగ్గరు మంత్రులకు ప్రతిష్టాత్మకంగా మారాయి, డిప్యూటి సిఎం భట్టి, మంత్రులు పొంగులేటి, తుమ్మలలు తమ ప్రాంతాల్లో

మిగతా 4లో

ముస్లింల ఓట్ల కోసం కాంగ్రెస్ ఆరాటం

ఎస్సీఎస్టీ నిధులు మైనార్టీలకు బదలాయింపు

నిజాం నిరంకుశంపై అంకుశం దింపిన గడ్డ

ఎన్నికల హామీలను తుంగలో తొక్కిన సిఎం రేవంత్

మహబూబ్‌నగర్ ప్రచారంలో బిజెపి అధ్యక్షుడు నితిన్ నబిన్

అక్షరగళం, మహబూబ్‌నగర్,ఫిబ్రవరి 4:

తెలంగాణలో రాజకీయాలు చాలా దయనీయంగా ఉన్నాయని.. మనదేశ సంస్కృతి సంప్రదాయాలపై సీఎం రేవంత్ రెడ్డి దాడి చేస్తున్నారని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ సిన్హా విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును ఎండగట్టారు. కాంగ్రెస్ పార్టీ అంటే ముస్లింల

మిగతా 2లో

వేములవాడలో బిజెపి జెండా ఎగరేస్తాం

ఎన్నికల ప్రచారంలో కేంద్రమంత్రి బండి సంజయ్

02

పోలీసులు నిష్పక్షపాతంగా ఉండాలని హితవు

ఆంధ్రా రాష్ట్రంలో జంగిల్ రాజ్యం నడుస్తోంది

02

అంబటి, జోగి రమేష్ ఇళ్లపై దాడులే నిదర్శనం

ఏడాదిన్నర కాలంగా ప్రజలను మభ్యపెడుతున్న బాబు

తిరుమల నెయ్యిలో జంతువు కొవ్వు అంటూ దుష్ప్రచారం

దేవుడంటే భయం, భక్తి లేకుండా రాజకీయాలు

కులమతాలను రెచ్చగొట్టేలా ఫ్లెక్సీల ఏర్పాటు అభ్యంతరకరం

అంబటి కుటుంబాన్ని పరామర్శించిన మాజీ సిఎం జగన్

వేములవాడలో బిజెపి జెండా ఎగరేస్తాం

వేములవాడ,ఫిబ్రవరి 4:

వేములవాడ మున్సిపాలిటీని భాజపా కైవసం చేసుకోవడం ఖాయం అని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. నిధులిచ్చేది మోదీ... తెచ్చేది నేను. మరి కాంగ్రెస్, భారాసకు ఎందుకు ఓట్లేయాలి?కాంగ్రెస్ ఇచ్చిన హామీల్లో ఒక్కటైనా అమలు చేశారా? అని ప్రశ్నించారు. సిరిసిల్ల, వేములవాడలో జరిగిన మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో బండి సంజయ్ పాల్గొన్నారు. మహిళలకు రూ.2500, తులం బంగారం, స్కూటీ ఇచ్చారా? అవ్వాతాతలకు రూ.4 వేల పెన్షన్ ఇచ్చారా? నిరుద్యోగులకు 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేశారా? నిరుద్యోగ భృతి ఇచ్చారా? పదేళ్ల బీఆరఎస్ పాలనలో ప్రజల రక్తాన్ని పీల్చి పిప్పి చేశారు. కేంద్రం నిధులిస్తే కమీషన్లు దండుకున్నారు. మళ్లీ దొంగ హామీలతో కాంగ్రెస్, బీఆరఎస్ నేతలు మీ ముందుకు వస్తున్నారు. ఎందుకు ఓటేయాలంటూ ఆ రెండు పార్టీలను నిలదీయండని బండి సంజయ్ పిలుపునిచ్చారు. వేములవాడ ఎమ్మెల్యే భాజపా కార్యకర్తలను బెదిరిస్తుంటే పోలీసులు వంతపాడతారా కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పద్ధతి మార్చుకోకపోతే వేములవాడలోనే కూర్చుంటా.. మీ డీజీపీ, ఎస్పీని ఇక్కడికి రప్పించాల్సి ఉంటుంది అంటూ.. సిరిసిల్ల పోలీసులను కేంద్ర మంత్రి బండి సంజయ్ హెచ్చరించారు. ఈ సందర్భంగా పోలీసుల తీరుపై విరుచుకుపడ్డారు. మా రిక్వెస్ట్‌ను చేతగానితనంగా భావిస్తున్నారా? ఎన్నికలు ప్రశాంతంగా జరగాలని లేదా అని అన్నారు. సిరిసిల్ల సీఐ క్రిష్ణ.. భాజపా నాయకులు, సిబ్బందిపై దాడి చేసి ఓవరాక్షన్ చేశారని బండి సంజయ్ మండిపడ్డారు. తక్షణమే విధుల్లోంచి తప్పించకపోతే తీవ్ర పరిణామాలుంటాయని హెచ్చరించారు.

మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌నే గెలిపించండి

(మొదటిపేజీ తరువాత)

సంక్షేమ పథకాలను చూసి ప్రజలు కాంగ్రెస్‌కే ఓటు వేయాలని పిలుపునిచ్చారు. వరి ఉత్పత్తిలో మిర్యాలగూడ ఆసియాలోనే ముందుంది. మిర్యాలగూడ మున్సిపాలిటీలో బీఆరఎస్ బీఫాం మీద పోటీ చేస్తున్న ఆడబిడ్డలకు కూడా ఆర్టీసీలో ఉచితంగా బస్సు ప్రయాణం కల్పించాం. సంక్షేమ పథకాల అమలులో ఎక్కడా వివక్ష చూపలేదు. రైతు రుణమాఫీ కింద 25.35 లక్షల మందికి రూ.21 వేల కోట్లు ఖర్చు చేశాం. రైతులకు గిట్టుబాటు ధరతో పాటు రూ.500 బోనస్ ఇస్తున్నాం. రైతు భరోసా కింద రూ.6వేల చొప్పున రూ.9వేల కోట్లు ఇచ్చాం. మున్సిపల్ ఎన్నికలు ముగిశాక రైతు భరోసా నిధులు జమ చేస్తాం. దేశంలో అత్యధికంగా రైతుల కోసం రూ.1.10 లక్షల కోట్లు ఖర్చు చేశాం. ఏప్రిల్‌లో కొత్త బ్జడెట్‌లో లక్షలాది ఇళ్లు పేదలకు ఇస్తాం. పేదల ఆత్మగౌరవం పెంచే బాధ్యత తీసుకుంటాం. నల్గొండ జిల్లాపై కోపంతో ఎసఎల్‌బీసీని పక్కనపెట్టారు. ఎసఎల్‌బీసీ ఆగిపోతే మామ, అల్లుళ్లు దావతు చేసుకున్నారు. నల్గొండ ప్రజలు ఫ్లోరైడ్ నీళ్లు తాగడానికి కారణం బీఆరఎస్. రెండేళ్లలో పూర్తి చేసే లక్ష్యంతో ఎసఎల్‌బీసీ పనులు చేపట్టాం. కేసీఆర్‌కు పోలీసులు నోటీసు ఇస్తే.. తెలంగాణ జాతికి ఇచ్చినట్టు చెబుతున్నారని సీఎం విమర్శించారు. గత ప్రభుత్వం సంక్షేమ పథకాలను మార్చి, అభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని సీఎం విమర్శించారు. సన్నబియ్యం పొందుతున్న లబ్దిదారులంతా కాంగ్రెస్‌ను ఆశీర్వదించాలని కోరారు. ముఖ్యంగా మున్సిపల్ ఎన్నికలు ముగిసిన వెంటనే రైతు భరోసా అందిస్తామని సీఎం హామీ ఇచ్చారు. మహిళలకు ఉచిత బస్సు పథకం నిజంగా వరంగా మారిందని, ఆర్టీసీ బస్సుల్లో టికెట్ లేకుండా ప్రయాణిస్తున్న మహిళలు కాంగ్రెస్‌కు ఓటేస్తే.. బీఆరఎస్ అడ్రస్ గల్లంతు అవుతుంది అంటూ వ్యాఖ్యానించారు. అలాగే ఇతర నాయకులకు కూడా 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందుతుందని, సంక్షేమ పథకాల అమలులో ఎలాంటి వివక్ష లేదని స్పష్టం చేశారు. 10 ఏళ్లపాటు అధికారంలో ఉన్న కేసీఆర్‌కు పేదవాళ్లకు ఇళ్లు ఇవ్వాలనే ఆలోచన రాలేదని సీఎం విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం డిమాండ్ ఉందని, రాబోయే బడ్జెట్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భారీగా నిధులు కేటాయించి పేదల ఆత్మగౌరవాన్ని కాపాడతామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం నల్లగొండ జిల్లా ప్రజలపై కోపంతో అ ప్రాజెక్టును నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. అ ప్రమాదంలో 8 మంది మృతి చెందితే మామ?అల్లుళ్లు సంబరాలు చేసుకున్నారని ఇంట్రెస్టింగ్ వ్యాఖ్యలు చేశారు. గంజి గతి లేని నాయకులు బెంజ్ కార్లు కొనుగోలు చేశారని ఎద్దేవా చేశారు. ఎన్నికల్లో మిగితా నేతలు డబ్బులు ఇస్తే తీసుకోండి, కానీ ఓటు మాత్రం కాంగ్రెస్‌కే వేయాలని పిలుపునిచ్చారు. గత ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడిందని సీఎం ఆరోపిస్తూ.. జాతిపిత ఎవరన్న ప్రశ్నకు సమాధానంగా, తెలంగాణ కోసం సర్వం త్యాగం చేసిన ప్రొఫెసర్ జయశంకర్‌నే జాతిపిత అని, తెలంగాణ ఇచ్చిన సోనియా గాంధీనే తెలంగాణ తల్లి అని స్పష్టం చేశారు. రెండేళ్లలో జరిగిన తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిని చూసి మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు వేయాలని సీఎం పిలుపునిచ్చారు. మరో ఎనిమిదేళ్లు కాంగ్రెస్ అధికారంలో ఉంటుందని ధీమా వ్యక్తం చేస్తూ, 'కాంగ్రెస్ గెలిస్తే పేదవారు గెలుస్తారు' అని సీఎం అన్నారు.

ఆంధ్రా రాష్ట్రంలో జంగిల్ రాజ్యం నడుస్తోంది

గుంటూరు,ఫిబ్రవరి 4: సీఎం చంద్రబాబు ఏడాదిన్నరగా కావాలనే ప్రజలను మభ్యపెట్టే కార్యక్రమం చేపట్టారని సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మండిపడ్డారు. తిరుమల లడ్డు నెయ్యిలో జంతువుల కొవ్వు ఉందని రకరకాలుగా ప్రచారం చేశారని, చివరికి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కూడా అసత్య ప్రచారం చేశారని అసహనం వ్యక్తం చేశారు. దేవుడంటే ఏమాత్రం భయం, భక్తి లేకుండా రాజకీయాలు చేశారని ఫైర్ అయ్యారు. అంబటి రాంబాబు, జోగి రమేష్, విడదల రజని మీద దాడులు చేశారని.. వారు చేసిన తప్పేంటి? అని ప్రశ్నించారు. ఇదే ప్రభుత్వం ఎప్పుడూ ఉండదని, వచ్చే మూడేళ్లలో తమ ప్రభుత్వం వస్తుందని వైఎస్ జగన్ అన్నారు. టీడీపీ నేతల దాడిలో ధ్వంసమైన మాజీ మంత్రి అంబటి రాంబాబు ఇంటికి వెళ్లి.. ఆయన కుటుంబ సభ్యులను జగన్ పరామర్శించారు. వైఎస్ జగన్ మీడియాతో మాట్లాడుతూ? 'రాష్ట్రంలో జంగిల్ రాజ్యం నడుస్తుంది. భయానక వాతావరణంలో పాలన జరుగుతుంది. అంబటి, జోగి రమేష్ ఇళ్లపై దాడులు చూస్తే జంజిల్ రాజ్యం ఏ స్తాయిలో ఉందో తెలుస్తుంది. అంబటి, జోగి, కాకాణిలు చేసిన తప్పేంటి?. ప్రశ్నిస్తున్నారని మా వాళ్ళపై దాడులు చేస్తున్నారు. సీఎం చంద్రబాబు కుట్ర పూరితంగా జంతువుల కొవ్వు అని తప్పుడు ప్రచారం చేసాడు. ఆవు, పంది, చేప కొవ్వు అంటూ ఉద్దేశ్య పూర్వకాలంగా దేవుడి ప్రతిష్టను దిగజార్చే ప్రయత్నం చేసారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ గారికి దేవుడంటే భయం భక్తి లేవు. దుర్మార్గంగా తప్పుడు ప్రచారం చేశారు. కేంద్ర ల్యాబ్లు ఎలాంటి జంతువుల కొవ్వు లేదని రిపోర్ట్ ఇచ్చాయి. సీబీఐ అదే విషయాన్ని సుప్రీం కోర్టుకి రిపోర్ట్ ఇచ్చింది. తప్పు చేసి ఉంటే వైవీ సుబ్బారెడ్డి, కరుణాకర్ రెడ్డి పేర్లు సీబీఐ ఎందుకు చేర్చలేదు. సీబీఐ వాళ్లకు క్లీన్ చిట్ ఇచ్చింది. అసలు సీబీఐ విచారణ కావాలని సుప్రీమ్ కోర్టును కోరిందే వైవీ సుబ్బారెడ్డి. చంద్రబాబు, లోకేష్, పవన్లు చెంపలేసుకుని క్షమాపణ కోరాలి. క్షమాపణ చెప్పకుండా మళ్లీ అదే దుర్మార్గపు అపార్థాలను ప్రచారం చేస్తున్నారు. సిగ్గు లేకుండా ప్లెక్సీలు వేయిస్తున్నారు. కుల మతాలను రెచ్చగొట్టే ప్లెక్సీలు పెట్టడం రాజ్యాంగ విరుద్ధం కాదా. ఇలానే మేము సూపర్ సిక్స్ అమలు చెయ్యలేదని ప్లెక్సీలు వేస్తే ఒప్పుకుంటారా. ప్లెక్సీలు పెట్టి ప్రజల్లో బావోగ్వేదాలు రెచ్చగొట్టేలా చెయ్యడం తప్పు కాదా?. ఇలాంటి దుర్మార్గాలను ప్రశ్నిస్తే మా వాళ్ళపై దాడులు చేయిస్తారా?. సీఎం చంద్రబాబుకి మంచి బుద్ధి ప్రసాదించాలని దేవుణ్ణి కోరి గుడి నుండి వస్తుంటే దాడులు చేసారు. అంబటి రాంబాబుని పోలీసుల సమక్షంలో కర్రలు పట్టుకుని కారుపై దాడికి పాల్పడ్డారు. కారులో ఉన్న రాంబాబుని దారుణమైన భూతులు తిడుతూ దాడి చేసారు. ఒక్కడే ఉండటం వల్ల అంబటి ఆగ్రహానికి గురయ్యారు. అలాంటి సమయంలో నోట్లో నుండి రెండు తిట్లు వచ్చాయి. ప్రాణం మీదకి వచ్చినప్పుడు వచ్చిన తిట్లే తప్ప ఉద్దేశ్య పూర్వకంగా తిట్టలేదు. సంస్కారం ఉన్న వ్యక్తి కనుక ఆ మాటలు రావడంపై బాధపడి.. వివరణ ఇచ్చాడు. తిట్లు వచ్చినందుకు చింతిస్తూ వెనక్కి తీసుకున్నాడు. అలాంటి సంస్కారం ఉన్న అంబటిని చేతనైతే పొగడాలి.. కానీ దుర్మార్గంగా హత్య చెయ్యడానికి ప్రయత్నించారు. ఏకంగా 8 గంటల పాటు హత్యకు ప్రయత్నించారు. ఎమ్మెల్యే గల్లా మాధవి ఆధ్వర్యంలో పోలీసుల సమక్షంలో దాడి చేశారు. ఇంట్లో మహిళలను ఇష్టం వచ్చినట్లు తిడుతూ ఫర్నీచర్ పగలగొట్టారు. కార్లు ధ్వంసం చేసి.. ఆఫీస్ కి నిప్పు పెట్టారు. పోలీసులు బాధ్యతగా వ్యవహరించి ఉంటే ఇలాంటి దాడులు జరిగేవా?. డీజీపీ ఆఫీస్ కూతవేటు దూరంలో ఉంది.. పక్కనే బెటాలియన్ ఉంది.. కంట్రోల్ చెయ్యలేరా?. అధికారులకు ఫోన్లు చేసినా ఒక్కరు ఎత్తలేదు.. పక్కా ప్లాన్ ప్రకారం హత్యాయత్నం చేసారు' అని వైఎస్ జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

తెలంగాణ కోసం ఏనాడైనా రేవంత్ పోరాడారా?

(మొదటిపేజీ తరువాత)

ప్రశ్నించారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మెదక్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ నేతలు ఏ ముఖం పెట్టుకుని మెదక్ ప్రజలను ఓట్లు అడుగుతున్నారని ధ్వజమెత్తారు. 'మెదక్ నుంచి సిద్దిపేటకు ఆఫీసులను నేను తరలించానని అంటున్నారు. నేను తరలించిన ఆఫీస్ పేరు చెబితే నేనే తెచ్చిస్తా. రేవంత్‌రెడ్డి ఒక్కటంటే.. నేను రెండంటాను. ఆయన మంచి మాట్లాడితే.. మేము మంచే మాట్లాడతాం. ఆయన భాష జారితే.. మేము కూడా జారాల్సి వస్తుంది. రైతు భరోసా సొమ్ము ఈనెల 11లోపు ఇవ్వకపోతే కర్షక ఆగ్రహానికి గురికాక తప్పదు' అని హరీశ్‌రావు అన్నారు.

పవన్ ఆంధ్రా రాజకీయాలు చూసుకో

(మొదటిపేజీ తరువాత)

సంచలన వ్యాఖ్యలు చేశారు. పవన్ తన రాజకీయాలను ఆంధ్రాలోనే చేసుకోవాలని, తెలంగాణలో ఆయన ప్రచారం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదని స్పష్టం చేశారు. తెలంగాణలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీకి మద్దతుగా పవన్ కల్యాణ్ ప్రచారం చేస్తారనే వార్తలు వస్తున్న నేపథ్యంలో మహేశ్ గౌడ్ ప్రాధాన్యత సంతరించుకున్నాయి. గతంలో పవన్ తెలంగాణ గురించి చాలా నీచంగా మాట్లాడారు. బీజేపీ నేతలు పవన్ కల్యాణ్‌ను భిక్షాం దేహీ అని అడిగారు' అని ఆయన ఎద్దేవా చేశారు. గతంలో పవన్ తెలంగాణ గురించి చాలా నీచంగా మాట్లాడారని, అలాంటి వ్యక్తి మాటలు విని ఇక్కడి ప్రజలు ఓట్లు వేయరని అన్నారు. ఆయన మాటలను ఎవరూ విశ్వసించరని, ఆయన ప్రభావం తెలంగాణ రాజకీయాలపై శూన్యమని మహేష్ గౌడ్ స్పష్టం చేశారు. గతంలో తెలంగాణ రాష్ట్రం గురించి, తెలంగాణ వ్యక్తుల గురించి, భాష, సంస్కృతి గురించి దారుణంగా మాట్లాడారని మండిపడ్డారు. అందుకే పవన్ ను దిష్టి కల్యాణ్ అని అంటామని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. తెలంగాణ ప్రజలు అభివృద్ధి, సంక్షేమం కోరుకుంటున్నారుని.. కాంగ్రెస్ ప్రభుత్వం వారికి సంక్షేమం, అభివృద్ధి ఇస్తుందని అన్నారు. అందుకే రానున్న మున్సిపల్ ఎన్నికల్లో 90 శాతానికిపైగా మున్సిపాలిటీలు కాంగ్రెస్ గెలుచుకునే అవకాశం ఉందన్నారు. ఆ భయంతో పవన్ కల్యాణ్ లాంటి సినీ తారలను బీజేపీ నాయకులు అడుక్కునే పరిస్థితి వచ్చిందని విమర్శించారు. తెలంగాణలో పవన్ కల్యాణ్ ను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని.. ఆంధ్రాలో రాజకీయాలు చేసుకుంటే మంచిదని పీసీసీ చీఫ్ సూచించారు.

తెలుగు చిత్ర పరిశ్రమకు పెద్దపీట

(మొదటిపేజీ తరువాత)

సినీ రంగాన్ని ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ప్రతిభ, పారదర్శకత ఆధారంగానే అవార్డులు ఇవ్వాలని జ్యూరీ సభ్యులకు సూచించారు. ఉగాది రోజు మార్చి 19న ఘనంగా అవార్డుల పంపిణీ జరగనుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఈ సమావేశంలో జ్యూరీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు. కాగా, ఫిబ్రవరి 6 నుంచి గద్దర్ అవార్డుల స్క్రీనింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుంది. దేశవ్యాప్తంగా ఫిలిం ఇండస్ట్రీక్రి హైదరాబాదును కేంద్రంగా చేయాలన్న ఆలోచనతో ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని భట్టి విక్రమార్క అన్నారు. బాంబే, కలకత్తా, చెన్నై వంటి పట్టణాల్లో సినీ ఇండస్ట్రీ పెరగడానికి అంతగా అవకాశాలు లేవు, కానీ దేశంలో ఉన్న అన్ని భాషల ఇండస్ట్రీలను హైదరాబాద్‌లో విస్తరించడానికి సానుకూల అంశాలు అనేకం ఉన్నాయని తెలిపారు. సకల భాషల సినీ ఇండస్ట్రీ, హైదరాబాద్‌కు తరలి వస్తే రాష్ట్ర యువతకు, టెక్నీషియన్లు, రైటర్లు, డైరెక్టర్లకు ఉపాధి లభిస్తుంది. సినీ ప్రపంచ మార్కెట్‌కు హైదరాబాద్ కేంద్రంగా మారుతుందని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన బ్లూ ప్రింట్ ప్రభుత్వం తయారు చేస్తుందని చెప్పారు. గత ప్రభుత్వం దశాబ్ద కాలం పాటు సినిమా రంగానికి సంబంధించిన అవార్డుల విషయంలో నిర్లక్ష్యం వహించి వదిలేస్తే, సమాజంలో అత్యంత ప్రభావం చూపే సామాజిక పరివర్తన తీసుకొచ్చే సినీ రంగాన్ని సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం అవార్డులు ఇచ్చి తిరిగి ప్రోత్సహించడం ప్రారంభించిందని వివరించారు.సమాజం కోసం కళల ద్వారా తన జీవితాన్ని త్యాగం చేసిన గొప్ప మహానుభావుడు గద్దర్ అని డిప్యూటీ సీఎం కొనియాడారు. తెలంగాణ అంటే కళలు, విప్లవం, ప్రశ్నించడం, సున్నిత మనసుతో, ప్రేమానురాగాలతో కూడినదని, తెలంగాణ కళలు, సంస్కృతిని ప్రపంచానికి చాటిన గొప్ప వ్యక్తి గద్దర్ అని పేర్కొన్నారు. అందుకే వారి పేరు మీద గత సంవత్సరం నుంచి సినిమా అవార్డులు ఇవ్వడం ప్రారంభించి, సినీ రంగాన్ని ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ప్రతిభ, పారదర్శకతలే ప్రమాణంగా సినిమా అవార్డుల ఎంపిక ఉంటుందని, గత సంవత్సరం జ్యూరీ సభ్యులు అవార్డుల ఎంపికను గొప్పగా నిర్వహించి, అభినందనలు పొందిన విషయాన్ని డిప్యూటీ సీఎం ఈ సందర్భంగా గుర్తు చేశారు. సినీ రంగ ప్రముఖులకు ఉన్న అనుభవాన్ని, నిబద్ధతను, సినిమా రంగం పట్ల వారికున్న అభిమానాన్ని దృష్టిలో పెట్టుకొని ఎఫ్ డి సి ద్వారా అందరితో సంప్రదింపులు జరిపి జ్యూరీ సభ్యులను ఎంపిక చేశారని, ప్రభుత్వ నుంచి కావలసిన సహకారాన్ని పూర్తిస్థాయిలో అందజేస్తామని తెలిపారు. ప్రతి పని సమాజానికి ఉపయోగపడాలి, ప్రజలకు జవాబు దారిగా ఉండాలన్న లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. గద్దర్ అవార్డుకు ఎంపిక చేసే సినిమాలో కమర్షియల్ అంశంతో పాటు సామాజిక సందేశం తప్పనిసరిగా ఉండేలా జాగ్రత్త తీసుకుంటే రాబోయే రోజుల్లో సమాజంలో మంచి సినిమాలను ప్రోత్సహించేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. ఈనెల 6 నుంచి గద్దర్ సినిమా అవార్డుల స్క్రీనింగ్ కార్యక్రమం ప్రారంభమవుతుందని, 19న ఉగాది పండుగ రోజు గద్దర్ అవార్డుల పంపిణీ కార్యక్రమం ఉంటుందని చెప్పారు. ఈ సమావేశంలో జ్యూరీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ మిర్చి రైతులకు గుడ్ న్యూస్

(మొదటిపేజీ తరువాత)

ఊరటనిస్తుంది.వివిధ రకాల మిర్చి ధరలు ఊహించనంత వేగంగా పెరుగుతుండడం రైతుల ఆదాయాన్ని గణనీయంగా పెంచింది. ఎల్లో, దేశీ, వండర్ హాట్ మిర్చి వంటి రకాల డిమాండ్ అంతర్జాతీయంగా కూడా ఎక్కువగా ఉండటంతో మార్కెట్ ఉత్సాహంగా ఉంది. రైతులు తమ ఉత్పత్తిని పెద్ద ధరకు విక్రయించగలిగితే, ఆర్థిక స్థితి మెరుగుపడుతుంది. వరంగల్ ఎనుమాముల మార్కెట్‌లో ప్రతి రకానికి ప్రత్యేక ధరలు ఉన్నాయని, ధరల పెరుగుదల కొనసాగుతుందని అధికారులు తెలిపారు. ధరల పెరుగుదల రైతుల ఉత్సాహాన్ని పెంచింది, కానీ నిలకడైన ఆదాయం కోసం మంచి మార్కెట్ వ్యూహాలు అవసరం. పంటలను సరైన సమయంలో మార్కెట్లో విడుదల చేయడం, నిల్వ మరియు రవాణా సదుపాయాలను మెరుగుపరచడం కీలకం. అంతర్జాతీయ మార్కెట్ ట్రెండ్‌లను గమనించి, ధరల మార్పులపై రైతులు సరిగా నిర్ణయాలు తీసుకోవాలి. ఈ పరిస్థితులు, రైతుల ఆర్థిక స్థితిని బలోపేతం చేస్తూ, స్థిరమైన లాభాలను అందించగలవని విశ్లేషకులు పేర్కొన్నారు.

కేఎల్ఎన్ఆర్ ఇన్ఫ్రా సీఎం రేవంత్ రెడ్డి బినామీ

(మొదటిపేజీ తరువాత)

పార్టీ బయటపెట్టిందని కేటీఆర్ వెల్లడించారు. కేఎల్ఎన్ఆర్ ఇన్ఫ్రా కంపెనీని సీఎం రేవంత్ రెడ్డి బినామీ కంపెనీగా కేటీఆర్ అభివర్ణించారు. జనవరి 23న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కేఎలఎసఆర్‌పై సుప్రీంకోర్టు నోటీసులు ఇచ్చిందని, దివాళా తీసిన కంపెనీకి కాంట్రాక్టులు ఎలా ఇస్తున్నారని సుప్రీంకోర్టు ప్రశ్నించిందని ఆయన చెప్పారు. కేఎల్ఎన్ఆర్ ఇన్ఫ్రాకు రూ.6 వేల కోట్ల టెండర్లు ఇచ్చారన్నారు. రేవంత్ రెడ్డి బినామీ చీఫ్ మినిస్టర్ అని, ఆయన్ను వెనుక నుంచి వేరే వాళ్లు నడిపిస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును కేఎల్ ఎన్ ఆర్ కు అప్పగించారని కేటీఆర్ తెలిపారు. రేవంత్ రెడ్డిపై గతంలో రైడ్స్ జరిగితే అందులో కేఎల్ ఎన్ ఆర్ కంపెనీ రేవంత్ రెడ్డి బినామీ కంపెనీ అని ఐటీ శాఖ అనుమానం వ్యక్తం చేసిందన్నారు. కేఎల్ఎన్ ఆర్ కంపెనీలో రేవంత్ రెడ్డి బినామీ పెట్టుబడులు ఉన్నాయని 2018లోనే ఐటీ చెప్పిందని గుర్తుచేశారు. రేవంత్ రెడ్డి సీఎం కాగానే కేఎల్ఎన్ఆర్ కు రెక్కలు వచ్చాయన్నారు కేటీఆర్. మెదక్‌లో ఆర్ అండ్ బి వర్క్స్, షాద్‌నగర్ పరిగి రోడ్, ఇరిగేషన్ వర్క్స్ ఇచ్చారని కేటీఆర్ అన్నారు. 2023 జులై నుంచి కేఎల్ ఎన్ ఆర్ కంపెనీ దివాళా తీసిందని ఆయన చెప్పారు. బినామీ బాగోతం బయటకు రాకుండా ఉండటం కోసం దావోస్ నుంచి బాగోతం నడిపారని మాజీ మంత్రి వ్యాఖ్యలు చేశారు. కేఎల్ఎన్ ఆర్ సంస్థకు ఇచ్చిన కాంట్రాక్టులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దావోస్‌లో సీఎం మాయమయ్యారనే వార్తలు వచ్చాయన్నారు. బినామీ బాగోతాలు చక్కబెట్టుకోవడం కోసమే ముఖ్యమంత్రి మాయమయ్యారా? అని కేటీఆర్ ప్రశ్నించారు. కేఎల్ఎన్ఆర్ కంపెనీ నుంచి రేవంత్ రెడ్డి కుటుంబీకులకు చెందిన కంపెనీలకు డబ్బులు బదిలీ అయ్యాయని కేటీఆర్ ఆరోపించారు. కేఎల్ఎన్ఆర్ కంపెనీపై పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్ సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలకు సంబంధించిన తీర్పు కామెడీ సీరియల్ అంటూ కేటీఆర్ ఎద్దేవా చేశారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ గాంధారి ప్రసాద్ కుమార్‌గా మారారని ఆయన విమర్శించారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కు స్వయంగా సీఎం కండువా కప్పారని తెలిపారు. దీనిపై కోర్టులోనే తేల్చుకుంటామని కేటీఆర్ స్పష్టం చేశారు.

ముస్లింల ఓట్ల కోసం కాంగ్రెస్ ఆరాటం

(మొదటిపేజీ తరువాత)

పార్టీ అని స్వయంగా ముఖ్యమంత్రే ప్రకటించారని గుర్తు చేశారు. బుధవారం నాడు మహబూబ్ నగర్‌లోని ఎంవిఎస్ కాలేజీ గ్రౌండ్‌లో బీజేపీ విజయ సంకల్ప సమ్మేళనం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రసంగించిన నితిన్ నబీన్.. ఎస్సీ, ఎస్టీలకు కేటాయించిన బడ్జెట్ నిధులను మైనార్టీలకు బదలాయించారని ఆరోపించారు. రాష్ట్రంలో 77 వేల ఎకరాల భూమి వక్ఫ్ బోర్డుకు ఉందని గుర్తు చేశారు. ముస్లింల ఓట్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేస్తోందని విమర్శించారు. ముస్లిం ఓటు బ్యాంకు కోసం కాంగ్రెస్ నేతలు ఆరాటపడుతున్నారని నితిన్ నబీబ్ విమర్శించారు. నిజాం నిరంకుశానికి వ్యతిరేకంగా ఈ గడ్డ నుంచి పోరాడారు. హైదరాబాద్ విముక్తి కోసం సర్దార్ వల్లభాయ్ పటేల్ కృషి చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలులో విఫలమైంది. ఎన్నికల హామీలను ప్రభుత్వం తుంగలో తొక్కింది. రైతు భరోసా, రుణమాఫీ, వ్యవసాయ కూలీలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదు. ఎస్సీలు, ఆదివాసీలు, బీసీలను ప్రభుత్వం మోసం చేసింది. అభివృద్ధి పనులు, బిల్లుల మంజూరుకు ఆరఆర్ ట్యాక్స్ కట్టాల్సిన దుస్థితి ఏర్పడింది. అవినీతి, కమీషన్ల ప్రభుత్వాన్ని కూకటివేళ్లతో పెకిలించాలని పిలుపునిచ్చారు. అన్ని వర్గాలకు న్యాయం జరగాలంటే భాజపాను గెలిపించాలి.రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో అనేక హిందూ దేవాలయాలను కూల్చారంటూ మండిపడ్డారు నితిన్ నబీన్. ఆలయాలపై రాజకీయం చేస్తే.. బీజేపీ చూస్తూ ఊరుకోదన్నారు. అవసరమైతే తాము ప్రాణ త్యాగానికైనా సిద్ధమని ప్రకటించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తన విధానాలు మార్చుకోకపోతే.. ఎక్కువ రోజులు ఉండబోదంటూ హెచ్చరించారు. ప్రధాని మోదీ.. మహిళలను లక్షాధికారులను చేయాలని చూస్తే.. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం మహిళలను పూర్తిగా మోసం చేసిందన్నారు. రాష్ట్రంలో మహిళలపై అత్యాచారాలు అధికమయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలపై జరుగుతున్న అన్యాయాలను ప్రతి ఇంటికి వెళ్లి వివరించాలని కార్యకర్తలకు నితిన్ నబీన్ సూచించారు. తెలంగాణకు సముచిత స్థాయిలో కేంద్రం నిధులు మంజూరు చేస్తోంది. రాష్ట్రంలో రైల్వేకు రూ.5,400 కోట్లకుపైగా కేటాయించింది. తెలంగాణకు మూడు హైస్పీడ్ రైల్ కారిడార్లు కేటాయించింది. రాష్ట్రంలో రెండు పారిశ్రామిక కారిడార్ల నిర్మాణం జరుగుతోంది. ప్రపంచ వ్యాప్తంగా మోదీ ప్రభుత్వం పట్ల ఆదరణ పెరుగుతోంది. ఈయూతో ఒప్పందం చేసుకుని దేశాభివృద్ధికి కృషి చేస్తోంది. కొన్నివర్గాలను సంతృప్తి పరచడానికి కాంగ్రెస్ నేతలు ప్రయత్నిస్తున్నారు. ముస్లిం ఓటు బ్యాంకు కోసం ఆరాటపడుతున్నారు. కాంగ్రెస్ పాలనలో బలహీనవర్గాలకు ఎలాంటి న్యాయం జరగలేదు. ఎస్సీ, ఎస్టీ సంక్షేమ పథకాల నిధుల్లో ప్రభుత్వం కోత పెడుతోంది. వక్ఫ్ బోర్డును బలోపేతం చేసేందుకు కాంగ్రెస్ సర్కారు యత్నిస్తోంది. హిందూ దేవాలయాలపై దాడులు జరుగుతున్నా నోరు మెదపట్లేదు. హిందువుల మనోభావాలు దెబ్బతీస్తూ ఆలయ భూములు ఆక్రమిస్తున్నారు. రాష్ట్రంలో సనాతన ధర్మం మీద జరుగుతున్న దాడులను సహించం' అని నితిన్ నబీబ్ అన్నారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు లక్ష్మణ్, రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు, ఎంపీలు డీకే అరుణ, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పలువురు భాజపా నేతలు పాల్గొన్నారు. అధికారంలోకి వచ్చిన

అవగాహనే కాదు కార్యాచరణా అవసరమే

భారతదేశంలో క్యాన్సర్ నానాటికీ విస్తరిస్తోంది. ప్రతి ఏడాది 15 లక్షలకు పైగా కొత్త కేసులు నిర్ధారణ అవుతుండగా, దాదాపు 9 లక్షల మంది ప్రాణాలు కోల్పోతున్నారు. 2040 నాటికి ప్రతి ఏడాది కొత్త క్యాన్సర్ కేసుల సంఖ్య 20 లక్షలు దాటుతుందని, మరణాలు కూడా 12 నుంచి 15 లక్షల వరకు పెరుగుతాయని అంచనా. ప్రస్తుతం ప్రతి 9 మంది భారతీయుల్లో ఒకరికి జీవితకాలంలో క్యాన్సర్ వచ్చే అవకాశం ఉంది. సమస్యను మరింత తీవ్రం చేస్తున్న అంశం– 60 శాతం కంటే ఎక్కువ రోగులు క్యాన్సర్ పురోగతి దశల్లో చికిత్సకు వస్తున్నారు. ఈ దశలో చికిత్స అవకాశాలు పరిమితంగా ఉంటాయి. జీవనావధి ఫలితాలు కూడా ఆశించిన స్థాయిలో ఉండటం లేదు. ప్రతి అంతర్జాతీయ క్యాన్సర్ దినోత్సవం రోజున, మనం అవగాహన గురించి మాట్లాడతాం. కానీ రోగులు వ్యాధి పట్ల భయంతో, నిర్లక్ష్యంతో చికిత్సకు ఆలస్యంగా వస్తున్నారు. అవగాహన మాత్రమే సరిపోవడం లేదు. ఇప్పుడు భారత్‌కు కావలసింది నిర్ణయాత్మకంగా పాటించే చర్యలు.ఈ సంవత్సరం అంతర్జాతీయ క్యాన్సర్ దినోత్సవ థీమ్ 'యునైటెడ్ బై యూనిక్'. ప్రామాణికమైన, ఫలితమిచ్చే చర్యల వైపు అడుగులు వేయమని ఇది దేశాలకు సూచిస్తోంది. ఈ థీమ్ ప్రతి క్యాన్సర్ ప్రయాణం ప్రత్యేకమని గుర్తించి, రోగుల అనుభవాలు, విధానాలను నిర్ణయించడంలో మార్గదర్శకంగా ఉండాలని కోరుతోంది. మాటల నుంచి నిజమైన అమలుకు మార్పుగా, ప్రకటనల నుంచి బాధ్యతాయుత చర్యలకు మారవలసిన అవసరాన్ని ఈ థీమ్ సూచిస్తోంది.

మన దేశంలో క్యాన్సర్ చికిత్సకు ఇప్పటికే శక్తిమంతమైన సౌకర్యాలు ఉన్నాయి. ఆయుష్మాన్ భారత్ పథకం లక్షల మందికి అధిక వైద్య ఖర్చులు తగ్గించడంలో కీలకంగా నిలిచింది. నిధులు అందించడం మాత్రమే కాదు; కాన్సర్‌ను ముందస్తు నివారణ, ప్రారంభ దశలోనే గుర్తించాల్సి ఉంది. ఆయుష్మాన్ భారత్ కింద ఉన్న హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్స్ క్రమ పద్ధతిలో క్యాన్సర్ స్క్రీనింగ్ నిర్వహించాలి. రాష్ట్రాల్లో క్యాన్సర్ స్క్రీనింగ్ సమగ్రంగా అమలు కావడం లేదు. శిక్షణ లోపాలు, బలహీనమైన రిఫరల్ వ్యవస్థలు, పర్యవేక్షణ లోపం ఉంటోంది.

క్యాన్సర్, డయాబెటిస్, హృదయ సంబంధ వ్యాధులు, స్ట్రోక్‌ల నివారణ– నియంత్రణ కోసం జాతీయ కార్యక్రమం(ఎన్‌పీసీడీసీఎస్) ఒక బలమైన రూపురేఖను అందిస్తున్నది. అయితే, అమలు సరిగా జరగని కారణంగా దాని ప్రభావం తగ్గింది. ఎన్‌పీసీడీసీఎస్‌ను ఆయుష్మాన్ భారత్‌తో అనుసంధానం చేయాలి. దీంతో ప్రాథమిక వైద్యం నుంచి జిల్లా ఆసుపత్రులు, తృతీయ స్థాయి కేంద్రాలకు నిరవధిక రిఫరల్ వ్యవస్థ అందుబాటులో ఉంటుంది. స్క్రీనింగ్ చేయించుకున్న ప్రతి వ్యక్తికీ అనుమానం నుంచి నిర్ధారణ వరకు, అక్కడి నుంచి చికిత్స వరకు– స్పష్టంగా అనుసరించగల మార్గం ఉండాలి.పెద్ద నగరాల్లోని ఆసుపత్రుల మీద మాత్రమే భారత్ ఆధారపడకూడదు. జిల్లా ఆసుపత్రులు నిజమైన క్యాన్సర్ కేంద్రాలుగా పనిచేయాలి. ఇందుకు– అంకాలజీ ప్రాథమిక విషయాల్లో శిక్షణ పొందిన డాక్టర్లు కావాలి; పాథాలజీ, ఇమేజింగ్ సేవలు పనిచేయాలి; జిల్లా ఆసుపత్రులు, పెద్ద ఆసుపత్రులతో టెలికాన్సర్ బోర్డ్స్ ద్వారా శిక్షణ కావాలి; రిఫరల్ ఎలా చేయాలో స్పష్టమైన మార్గదర్శకాలు ఉండాలి. క్యాన్సర్‌ను ప్రారంభ దశలో గుర్తించి, సరైన కేంద్రానికి రిఫర్ చేయగల సామర్థ్యం ఉండాలి. ఇలా చేయడం ప్రాణనష్టాన్ని తగ్గిస్తుంది. 'యునైటెడ్ బై యూనిక్' అనే భావన క్యాన్సర్ సంరక్షణ కేవలం వైద్యపరమైనదే కాదు, అది లోతైన మానవీయత అంశమని మనకు గుర్తుచేస్తుంది. భయం, అపభ్యాతి (స్టిగ్మా), అయోమయం, ఆర్థిక ఆందోళనలు వంటివి, క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలకు రాకుండా రోగులను వెనక్కు తగ్గేలా చేస్తాయి. ప్రజాకేంద్రీకృత సంరక్షణ అంటే– నిజాయితీతో కూడిన, కరుణాత్మక సంభాషణ; విభిన్న వైద్య నిపుణుల సమూహ చర్చ ద్వారా నిర్ణయాలు; చికిత్సతో పాటు మానసిక, సామాజిక మద్దతు అందించడం; సమాచారంతో కూడిన నిర్ణయ స్వేచ్ఛకు గౌరవం ఇవ్వడం... వీటితో ఫలితాలు మెరుగుపడతాయి.

క్యాన్సర్ ఫలితాలను మెరుగుపరచడంలో బలమైన క్యాన్సర్ రిజిస్ట్రీలు కీలకం. రోగుల సమాచారం, క్యాన్సర్ సంభవించే భౌగోళిక ధోరణులు, క్యాన్సర్ రకాలపై తులనాత్మక విశ్లేషణ ద్వారా ప్రమాద కారకాలను అంచనా వేయడం, వ్యాధి వచ్చే అవకాశం ఎక్కువగా ఉన్నవారిని గుర్తించడంతో పాటు క్యాన్సర్ నివారణ, స్క్రీనింగ్ కార్యక్రమాలను ప్రణాళిక చేయడం సాధ్యమవుతుంది. ప్రస్తుతం దేశంలో కేవలం 38 జనాభా ఆధారిత క్యాన్సర్ రిజిస్ట్రీలు (PBCRs) మాత్రమే ఉన్నాయి. ఇవి దేశ జనాభాలో కేవలం 10శాతం మందిని మాత్రమే కవర్ చేస్తున్నాయి. విచారకరమైన విషయం ఏమిటంటే, వీటిలో ఎక్కువ భాగం పట్టణ ప్రాంతాల్లోనే ఉండగా, గ్రామీణ ప్రాంతాలకు అంకితమైనవి కేవలం రెండు మాత్రమే. సేకరించే డేటా నాణ్యతను నిర్ధారించడంలో ఈ రిజిస్ట్రీలు నిధుల కొరత కారణంగా పరిమితులు ఎదుర్కొంటున్నాయి. ఆంధ్రప్రదేశ్, హర్యానా, ఛత్తీస్‌గఢ్, హిమాచల్‌ప్రదేశ్, ఝార్ఖండ్, ఒడిశా, రాజస్థాన్ వంటి రాష్ట్రాల్లో ఇప్పటికీ జనాభా ఆధారిత క్యాన్సర్ రిజిస్ట్రీ ఒక్కటి కూడా లేదు. ఆసుపత్రుల్లో నమోదయ్యే క్యాన్సర్ రోగుల వివరాలకే పరిమితమైన 268 ఆసుపత్రి ఆధారిత క్యాన్సర్ రిజిస్ట్రీలు ఉన్నా, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో మరిన్ని PBCRలను ఏర్పాటు చేసి, సమర్థవంతంగా పనిచేయించాలి. ఆరోగ్యం, కుటుంబ సంక్షేమంపై పార్లమెంటరీ స్థాయి కమిటీ 2022 సెప్టెంబర్‌లో క్యాన్సర్‌ను 'నోటిఫైయబుల్ వ్యాధి'గా వర్గీకరించాలని సిఫార్సు చేసింది. అయితే, ఇది ఇప్పటివరకు వాస్తవరూపం దాల్చలేదు. క్యాన్సర్‌ను 'గుర్తించదగిన వ్యాధి'గా ప్రకటించడం వల్ల క్యాన్సర్ మరణాలపై బలమైన, సమగ్ర డేటాబేస్‌ను ఏర్పాటు కావడమే కాకుండా, దేశంలో ఈ వ్యాధి సంభవించే స్థాయి, వ్యాప్తిని కచ్చితంగా నిర్ధారించడంలో సహాయపడుతుంది. భారతదేశం స్పష్టమైన లక్ష్యాలు, కాలపరిమితులను నిర్ధారించుకోవాలి. క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించడం లక్ష్యంగా పెట్టుకోవాలి. జిల్లా స్థాయిలో నిర్ధారణ, రిఫరల్ సేవలు అందుబాటులో ఉండాలి. క్యాన్సర్ చికిత్స కారణంగా కుటుంబాలు ఎదుర్కొనే తీవ్రమైన ఆర్థిక భారాన్ని నివారించాలి. క్యాన్సర్‌పై అవగాహన ప్రజల్లోకి ఇప్పుడిప్పుడే వెళ్తోంది. ఇకపై మన ప్రతిస్పందనను నిర్వచించాల్సింది కార్యాచరణే. ప్రతి క్యాన్సర్ ప్రయాణం ప్రత్యేకమైనదని మనం విశ్వసిస్తే, ప్రారంభ దశలో గుర్తించి కాపాడిన ప్రతి జీవితం మన విజయానికి కొలమానం కావాలి. భారతదేశం అవగాహన నుంచి కార్యాచరణ వైపు దృఢంగా ముందుకు సాగాలి.

వాణిజ్య బంధాలూ సమర వివాదాలూ

రాష్ట్రపతి ప్రసంగం ముగిసిన తర్వాత కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన రెండో రోజే పార్లమెంటులో తీవ్ర గందరగోళం నెలకొన్నది. దీన్నిబట్టి చూస్తే అసలు పార్లమెంట్ సమావేశాలు సజావుగా జరగాలన్న ఉద్దేశం అటు ప్రతిపక్షాలకు కానీ, ఇటు ప్రభుత్వానికి కానీ ఉన్నదా అన్న అనుమానం వస్తోంది. సాధారణంగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన తర్వాత రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరగడం ఆనవాయితీ. ఆ తర్వాతే బడ్జెట్ ప్రతిపాదనలపై చర్చలు మొదలవుతాయి. పార్లమెంటు ఉభయ సభలనుద్దేశించి రాష్ట్రపతి వెలువరించే ప్రసంగం ఒక రకంగా ప్రభుత్వ విధాన డాక్యుమెంట్. నిజానికి మోదీ ప్రభుత్వం అమలుపరుస్తోన్న వివిధ సంక్షేమ పథకాలు, కార్యక్రమాలు, మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఇస్తోన్న ప్రాధాన్యం గురించి రాష్ట్రపతి ప్రపంగం వివరించింది.. రాజకీయ విభేదాలు విస్మరించి వికసిత్ భారత్ లక్ష్యానికి అనుగుణంగా జాతీయ ప్రజాప్రతినిధులు అందరూ దేశ ప్రయోజనాలకోసం కలిసికట్టుగా కృషి చేయాలని రాష్ట్రపతి పిలుపునిచ్చారు. విచిత్రమేమంటే బడ్జెట్ ప్రవేశపెట్టిన మరుసటి రోజే పాలక, ప్రతిపక్షాల మధ్య తీవ్ర వాదోపవాదాలతో సభా సమావేశాలు కొనసాగలేని పరిస్థితి ఏర్పడింది. ఇందుకు ఎవరు కారణం? రాష్ట్రపతి ప్రసంగంపై సోమవారం నాడు ప్రారంభమైన చర్చలో బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య కాంగ్రెస్‌పై వాడి వేడి బాణాలు సంధించారు. భారతీయ నాగరికత, సంస్కృతి, జాతీయవాదం, దేశభక్తి అనే వాటికి కాంగ్రెస్ పార్టీ తీవ్ర వ్యతిరేకమని ఆయన మాట్లాడిన మాటలు కాంగ్రెస్‌ను రెచ్చగొట్టాయి.

ఇప్పటికే అనేక గాయాలతో రెచ్చిపోతున్న కాంగ్రెస్ ఊరుకుంటుందా? ఆ వెంటనే కాంగ్రెస్ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ రంగంలోకి దిగి తమ దేశ భక్తిని, జాతీయవాదాన్ని శంకించడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. 'మా దేశ భక్తి గురించి, భారతీయ సంస్కృతి గురించి బీజేపీ యువ ఎంపీ వ్యాఖ్యలు చేసినందుకే నేను కొన్ని వాక్యాలను చదివి వినిపించదలుచుకున్నాను' అని రాహుల్ మొదలుపెట్టారు. 'ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ' పేరిట 2020లో చైనాతో జరిగిన సరిహద్దు ఘర్షణపై మాజీ ఆర్మీ చీఫ్ జనరల్ ఎంఎం నరవణే రచించిన పుస్తకంలో ఉన్న అంశాలపై 'కారవాన్' అనే పత్రిక వెలువడిన ఆ పుస్తక భాగాలను చదవ సాగారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ గురించి నరవణే రాసిన వాక్యాలను చదవడం మొదలుపెట్టగానే బీజేపీ ఎంపీలు తీవ్ర గందరగోళం సృష్టించారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, హోంమంత్రి అమిత్ షా, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు తీవ్ర అభ్యంతరం తెలిపారు. ఇంకా ప్రచురణ కాని ఆ పుస్తకంలోని వాక్యాలను ఎలా చదువుతారని మంత్రులు ప్రశ్నించారు. స్పీకర్ ఓం బిర్లా కూడా 342 నిబంధన క్రింద అలా చదవడం కుదరదని స్పష్టం చేశారు. అధికార ప్రతిపక్ష సభ్యుల మధ్యే కాక, స్పీకర్‌కూ, ప్రతిపక్ష సభ్యుల మధ్య కూడా వాగ్వివాదం జరిగింది. మంగళవారం కూడా ఇదే పరిస్థితి కొనసాగింది. తాను నరవణే పుస్తకంలో ఉన్న అంశాలు సరైనవేనని సాధికారికంగా చెబుతున్నానంటూ రాహుల్ స్పీకర్‌కు నోట్ సమర్పించి మరీ మళ్లీ ప్రసంగం ప్రారంభించారు. అయితే అధికార పక్షం వారు యథా ప్రకారం రాహుల్ మాట్లాడకుండా అడ్డుకున్నారు. ప్రధానమంత్రి అన్న పదం ఉచ్చరించినప్పుడల్లా స్పీకర్ అడ్డుకున్నారు. రాహుల్‌ను అడ్డుకుంటున్నారని గందరగోళం సృష్టించినందుకు ఎనిమిది మంది కాంగ్రెస్ ఎంపీలను సస్పెండ్ చేశారు. చివరకు అనేక వాయిదాల తర్వాత సభ మళ్లీ బుధవారానికి వాయిదా పడింది. అసలీ పరిస్థితి ఎందుకు వచ్చింది? తేజస్వి సూర్య విమర్శనాస్త్రాలే కాంగ్రెస్‌ను రెచ్చగొట్టాయా? జనరల్ నరవణే పుస్తకంలోని అంశాలను రాహుల్ ప్రస్తావించకుండా బీజేపీ ఎందుకు అడ్డుకుంటోంది? నిజానికి నరవణే పుస్తకం వెలుగులోకి రాకుండా గత రెండేళ్లుగా కేంద్రం అడ్డుకుంటోంది. ఆ పుస్తకం ప్రచురించడానికి రక్షణమంత్రిత్వ శాఖ, విదేశాంగమంత్రిత్వ శాఖ ఇంతవరకూ పబ్లిషర్‌కు అనుమతినీయలేదు. 'నేను రాయాల్సింది రాశాను. ఇక ఆ పుస్తకాన్ని ఎలా విడుదల చేయాలో పబ్లిషరే తేల్చుకోవాలి' అని నరవణే అన్నారు. ఆ పుస్తకంలో తాను రాసిన అంశాలపై వస్తున్న వివాదం విషయమై కూడా ఆయన ఏ మాత్రం స్పందించలేదు. 'కారవాన్'లో వచ్చిన పుస్తక భాగాలపై కూడా ఆయన వ్యాఖ్యానించలేదు. అంటే తాను రాసిన వాటికి ఆయన కట్టుబడి ఉన్నట్లే కదా.

భారత్ చైనాల మధ్య సరిహద్దు ఘర్షణలు కొత్త కాదు. ఆ పొరుగు దేశంతో విభేదాలు యుద్ధానికి దారితీయడంలో నెహ్రూ ప్రభుత్వ తప్పిదాల గురించి అనేక పుస్తకాలు వచ్చాయి. చైనాతో యుద్ధం జరుగుతున్నప్పుడు అసోంను కోల్పోతామేమోనన్న ఆవేదనను నెహ్రూ వ్యక్తపరిచారు. 'నా హృదయం అసోం ప్రజలకోసం తపిస్తోంది..' అన్న ఆయన ఆవేదనాపూరిత వ్యాఖ్యలు సంచలనం సృష్టించాయి. కాంగ్రెస్ హయాంలో జరిగిన అనేక తప్పిదాలు, సంభవించిన పరాజయాలు, వాటిల్లిన వైఫల్యాలను కప్పిపుచ్చడానికి ఎవరూ ప్రయత్నించలేదు. ఇవాళ కాంగ్రెస్ పార్టీ దేశ రక్షణ, భద్రత నుంచి అనేక విషయాల్లో ఆత్మ రక్షణలో పడేందుకు, ఎన్నికల పరాభవాల నుంచి కోలుకోలేకపోతున్నందుకు అవే కారణం. మరి మోదీ హయాంలో ఇలాంటి విషయాలపై చర్చ జరిగేందుకు కూడా ఆస్కారం లేకుండా పోతోంది. ఏ చిన్న విజయం లభించినా ఉప్పొంగిపోయి, అమితోత్సాహం ప్రదర్శించి ప్రచారార్భాటాలు చేసేవారు జాతీయ ప్రాధాన్యమున్న వివాదాలపై చర్చించడానికి నిరాకరించడం దేనికి? జనరల్ నరవణే పుస్తకం బయటకు వచ్చి ఉంటే దానిపై కొద్ది రోజులు చర్చ జరిగి సమసిపోయివుండేది. గల్వాన్ లోయలో చైనా చొచ్చుకు వస్తున్నప్పుడు 'మీకేది సముచితమో అదే చేయండి' అని ప్రధానమంత్రి తనకు చెప్పారని రక్షణమంత్రి వెల్లడించినట్లు నరవణే రాశారు. ఆ సమయంలో జరిగిన ఘటనలేమిటో, ఎంతమందితో ఎన్ని చర్చల తర్వాత, ఎన్ని తర్జనభర్జనల తర్వాత ప్రధానమంత్రి సమస్యను ఆర్మీకే వదిలేయాలని అనుకున్నారో పార్లమెంటు సాక్షిగా వివరించడం సాధ్యం కాదు. అదే సమయంలో వివాదాన్ని పూర్తిగా తొక్కిపెట్టి పార్లమెంటులో ఎవరినీ గొంతెత్తనీయకుండా చేయడం కూడా రకరకాల అనుమానాలకు దారి తీస్తుంది.

నిజానికి బడ్జెట్ సమావేశాల్లో బడ్జెట్‌పై చర్చ జరగాలి. బడ్జెట్‌కు కొద్ది రోజులముందే యూరోపియన్ యూనియన్‌తో కుదిరిన 'సమస్త ఒప్పందాలకూ తల్లి' లాంటి ఒప్పందం కుదరడంపై సానుకూల చర్చ జరిగేందుకు వాతావరణం కల్పించాలి. అయితే నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై చర్చ రెండో రోజే నీరుకారిపోయింది. మోదీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రవేశపెట్టిన మూడో బడ్జెట్ ఇది. ఆదాయం రూ.36.5 లక్షల కోట్లు, ఖర్చులు రూ. 53.5 లక్షల కోట్లు కనుక దాదాపు రూ.12 లక్షల కోట్లు అప్పు చేయాలని, మిగతా మొత్తాన్ని ప్రజల నుంచి, పెట్టుబడుల ఉపసంహరణ నుంచి సేకరించాలని నిర్ణయించారు. మూలధన వ్యయం క్రింద రూ. 12.20 లక్షల కోట్లు కేటాయించడం, అందులో దాదాపు సగం రహదారి, రైల్ నెట్‌వర్క్‌కు మళ్లించడం, ఉత్పాదక రంగానికి చేయూత నివ్వడం, పారిశ్రామిక కారిడార్లను ప్రకటించడం, ఆహార ద్రవ్యోల్బణాన్ని తగ్గించే ప్రయత్నం చేయడం, గ్లోబల్ మార్కెట్‌లకు ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్లకు అనువుగా దేశాన్ని సంసిద్ధం చేయాలనుకోవడం... ఇత్యాదులన్నీ మెరుపుల్లా కనిపించవచ్చు. అయితే ఇవేవీ ఒక్కసారి భారతదేశ ఆర్థిక వ్యవస్థ ఉవ్వెత్తున పుంజుకునేలా చేయకపోవచ్చు. ఆర్థిక సర్వే సూచించిన నిర్మాణాత్మక సంస్కరణలపై విధాన నిర్ణయాలు తీసుకోలేకపోవచ్చు కాని ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా కొన్ని ప్రకటనలు చేసి తప్పించుకున్నట్లుగా కనపడుతోంది.

మార్కెట్ అనేది ప్రవాహం లాంటిది. దానికి ఎక్కడ అవరోధం కలిగినా మరో చోటికి ప్రవహిస్తుంది. తన దారిని తాను వెతుక్కుంటుంది. ట్రంప్ టారిఫ్‌లకు ప్రపంచం ఏమీ భయపడలేదు. అమెరికాను ఏకాకి చేసి దాని భాగస్వామ్య దేశాలు సైతం తమ వర్తక ఒప్పందాలను తాము కుదుర్చుకున్నాయి. భారత్‌తో యూరోపియన్ యూనియన్ కుదుర్చుకున్న ఒప్పందం అనేక వస్తువులపై జీరో టారిఫ్‌లు నిర్ణయించింది. చైనా, కెనడాలు కూడా తమ ఒప్పందాలు తాము కుదుర్చుకున్నాయి. దీనితో ట్రంప్ కూడా తన వైఖరి మార్చుకుని తన భాగస్వాములతో పోటీపడేందుకు భారత్‌పై విధించిన టారిఫ్‌లను 18శాతానికి తగ్గించక తప్పలేదు. అయితే రష్యా నుంచి చమురు కొనడాన్ని భారత్ మానివేస్తుందని, 500 బిలియన్ డాలర్ల మేరకు వ్యవసాయం, ఇంధనం, టెక్నాలజీ, బొగ్గు ఇతర అనేక ఉత్పత్తులను తమ దేశం నుంచి కొనుగోలు చేస్తుందని ట్రంప్ ప్రకటించడంలో ఈ ఒప్పందం ప్రయోజనాలపై చర్చలు ప్రారంభమయ్యాయి. అమెరికాతో మోదీ రాజీపడ్డారని, ఈ ఒప్పందం వల్ల మన రైతుల ప్రయోజనాలు దెబ్బతింటాయని రాహుల్ అంటే ఈ చారిత్రక ఒప్పందం భారత ప్రజలకు బృహత్తర అవకాశాలు కల్పిస్తుందని వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ పేర్కొన్నారు. ఇరు దేశాల సంయుక్త వ్యాపార ఒప్పంద వివరాలు అధికారికంగా బయటకు వెల్లడి కానంత వరకూ సానుకూల, ప్రతికూల వాదనలు శ్రేయస్కరం కాదు. ఏమైనా 2026 సంవత్సరం ప్రారంభంలోనే మోదీ ప్రభుత్వం రెండు కీలక అంతర్జాతీయ ఒప్పందాలను కుదుర్చుకున్నది. ఇదొక పరిణామం, సందేహం లేదు. అయితే నరవణే పుస్తకం, ఎప్‌స్టీన్ ఫైల్స్ వంటి వివాదాల్లో చిక్కుకోవడమూ జరిగింది. ఈ పరిణామాల పర్యవసానాలు ఎలా ఉంటాయో మున్ముందు తేలుతుంది.

కించపరచడమే ఎజెండానా?

తెలంగాణ రాష్ట్రంలో రాజకీయాలు మాత్రమే కాదు, మీడియా పనిచేసే తీరు కూడా మారాల్సి ఉన్నది. ఎందుకంటే.. రాష్ట్రంలో ప్రజల ఆశలు, అవసరాలు, సమస్యలను ప్రతిబింబించాల్సిన బాధ్యత మీడియాపై ఉంటుంది. కానీ ఇటీవలి కాలంలో తెలంగాణలోని కొన్ని టీవీ చానళ్లు, పత్రికలు తెలంగాణ ప్రజల దృష్టితో కాకుండా, ఆంధ్రప్రదేశ్ రాజకీయ ప్రయోజనాలకు దగ్గరగా వార్తలు చూపిస్తున్నాయనే భావన ప్రజల్లో బలంగా పెరుగుతున్నది.

మీడియా అనేది నిజాన్ని చెప్పాల్సిన వేదిక. కానీ అదే మీడియా ఒక రాజకీయ వర్గానికి అనుకూలంగా వ్యవహరిస్తే, ప్రజలకు వచ్చే సమాచారం అసంపూర్ణంగా లేదా వక్రీకరణగా మారుతుంది. ముఖ్యంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వంటి వారిపై సందర్భం లేకుండా, ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం, గత బీఆర్ఎస్ పాలనపై విషయం చిమ్మడం, స్కామ్ లు అంటూ తప్పుగా ప్రచారం చేయడం, మంచి పాల న అంశాలను పూర్తిగా పక్కన పెట్టడం లాంటి ధోరణి ప్రజల్లో పలు అనుమానాలకు కారణమవుతున్నది.

తెలంగాణ ఉద్యమ కాలంలో కూడా ఇలాంటి మీడియా ధోరణులు చూశాం. అప్పట్లో తెలంగాణ డిమాండ్‌ను తక్కువ చేసి చూపించేలా, ఉద్యమాన్ని తప్పుదారి పట్టించేలా కథనాలు వచ్చాయి. కానీ అప్పటి నుంచే కొన్ని ప్రధాన చానళ్లు తెలంగాణ డిమాండ్‌ను తక్కువ చేయడం, ఆంధ్ర ఆధిపత్యాన్ని ప్రశ్నించే స్వరాలను చూపించకపోవడమే కాకుండా కించపరిచేలా చూపించాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడకూడదనే కుట్రతోనే అసత్య కథనాలు ప్రసారం చేశాయనే విమర్శలు అప్పట్లోనే వచ్చాయి.

తెలంగాణ ఉద్యమాన్ని 'ప్రాంతీయ వాదం', 'విభజన రాజకీయాలు', 'అభివృద్ధికి అడ్డంకి' అనే పదాలతో చిత్రీకరిస్తూ, ఉద్యమకారులపై అనుమానాలు, భయాలను సృష్టించే ప్రయత్నం జరిగింది. కొన్ని చానళ్లు, పత్రికలు అప్పటి ఆంధ్రప్రదేశ్ రాజకీయ నాయకుల, సంపన్న వర్గాల దృక్పథానికి అనుకూలంగా తెలంగాణ ఆకాంక్షలను చిన్నచూపు చూశాయి. ఉద్యమ సమయంలో జరిగిన ఆత్మ బలిదానాలు, నిరసనలు, ప్రజా ఉద్యమాల తీవ్రతను తక్కువగా

చూపించి, సమైక్య ప్రభుత్వ వాదనలకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా తెలంగాణ ప్రజల భావోద్వేగాలను నిర్వీర్యం చేశాయి. రాష్ట్ర సాధన తర్వాత కూడా పెద్ద మీడియా సంస్థల యాజమాన్యాలు ఆంధ్ర నేపథ్యం కలిగిన కార్పొరేట్ గ్రూపుల చేతుల్లో ఉండటం వల్ల, వారి కవరేజీలో పక్షపాత ధోరణి ఉండేది. ఇది కేవలం భావోద్వేగం మాత్రమే కాదు. అనేక సందర్భాల్లో జరిగిన ఘటనలు ఈ అనుమానాలను బలపరుస్తున్నాయి. అదే మీడియా ఇప్పుడు కూడా రూపం మార్చుకుని, తెలంగాణ ఆత్మగల రాజకీయ నాయకత్వాన్ని నిరంతరం అవమానించే ప్రయత్నం చేస్తున్నది. ఇది కేవలం రాజకీయ సమస్య కాదు, ప్రజల ఆత్మగౌరవానికి సంబంధించిన అంశం.

టీవీ చానళ్లు నిర్వహించే డిబేట్లు, ప్యానెల్ చర్చలు, బ్రేకింగ్ న్యూస్‌లు కూడా ఒక నిర్దిష్ట రాజకీయ కథనాన్ని నిర్మించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఉదాహరణకు..కేసీఆర్ హయాంలో అమలు చేసిన అనేక ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ఉన్నప్పటికీ, వాటిని తక్కువగా చూపిస్తూ, ఇతర పక్షాల అబద్ధపు ఆరోపణలను హైలైట్ చేయడం ద్వారా బీఆర్ఎస్ ప్రభుత్వంపై ప్రజల ఆలోచనలో గందరగోళం సృష్టించారు. ముఖ్యంగా కేసీఆర్‌ను లక్ష్యంగా చేసుకుని తప్పుగా చిత్రీకరించే కథనాలను నేటికీ ఆపడంలేదు. ఆ చానళ్లు పొరుగు రాష్ట్ర నాయకుల పట్ల మాత్రం అనుకూల వైఖరిని కనబరుస్తూ ద్వంద్వ ప్రమాణాలను బయట పెట్టుకుంటున్నాయి.కేసీఆర్ పట్ల, తెలంగాణ అస్తిత్వం పట్ల విషం చిమ్ముతున్న మీడియాకు తోడుగా సోషల్ మీడియా కూడా మొత్తం ప్రక్రియలో రెచ్చిపోతున్నది. ఆంధ్రా కేంద్రంగా పనిచేస్తున్న అనేక సోషల్ మీడియా హ్యాండిల్స్, యూట్యూబ్ చానెళ్లు, ట్రోలింగ్ గ్రూపులు తెలంగాణ రాజకీయాలను లక్ష్యంగా చేసుకుని తప్పుడు వార్తలు, వీడియోలు, వక్రీకరణలను వైరల్ చేస్తున్నాయి. ముఖ్యంగా కేసీఆర్, కేటీఆర్, బీఆర్ఎస్ నేతలపై వ్యక్తిగత దాడులు, అవమానకరమైన మీమ్స్, అసత్య ఆరోపణలు విస్తృతంగా ప్రచారం చేస్తున్నాయి. ఈ డిజిటల్ ప్రచారం సాధారణ ప్రజల మనసుల్లో గందరగోళం, ద్వేష భావాలు మరింత రాజేస్తున్నాయి.

మీడియా కవరేజీలో పక్షపాత ధోరణి ఆరోపణలు కొత్త కావు. ముఖ్యంగా కేసీఆర్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన కాళేశ్వరం, పాలమూరురంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ వంటి భారీ నీటిపారుదల ప్రాజెక్టులపై ఆంధ్రా చానళ్లు తరచూ అసత్య ఆరోపణలనే హైలైట్ చేస్తూ వార్తలు ప్రసారం చేశాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆ పార్టీ నేతలు కేసీఆర్‌పై తీవ్ర ఆరోపణలు చేయడం, వ్యక్తిగత దూషణలకు కూడా పాల్పడటం, ఆ వ్యాఖ్యలను ఆంధ్రా చానళ్లు విస్తృతంగా ప్రసారం చేయడంతో తెలంగాణ ప్రజలకు నష్టం జరిగింది. కేసీఆర్ ఇటీవల 'ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఏర్పాటే తెలంగాణకు శాపం' అని వ్యాఖ్యానించినప్పుడు కూడా ఆంధ్రా మీడియా దానిని పెద్దగా హైలైట్ చేసి, ఆయనను తీవ్రంగా విమర్శించింది. ఆ వ్యాఖ్య చారిత్రక, భావోద్వేగ నేపథ్యం కలిగి ఉన్నప్పటికీ, దానిని తెలంగాణ వ్యతిరేక భావజాలంగా, విభజన వాదంగా చూపించే ప్రయత్నం జరిగింది. మీడియా ఫ్రేమింగ్ ఒక నాయకుడి పట్ల ఉద్దేశపూర్వకంగా ఎవరి ప్రయోజనాల కోసమో, ఎలా బురద చల్లుతుందో ఈ సందర్భంతో మనకు అర్థమవుతున్నది. చారిత్రకంగా చూస్తే, తెలుగు మీడియా రంగం ఎక్కువగా ఆంధ్రా ప్రాంతంలోని పెద్ద వ్యాపార వర్గాల ఆధిపత్యంలో ఉన్నది. పత్రికలు, టీవీ చానళ్లు, డిజిటల్ మీడియా సంస్థలు, వాటి యాజమాన్యాలు రాజకీయాలతో బలమైన సంబంధాలు కలిగి ఉన్నాయి. ఇప్పుడు తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో ఆంధ్ర చానళ్లు కాంగ్రెస్‌కు అనుకూలంగా వ్యవహరిస్తున్నాయి. తెలంగాణలోని కాంగ్రెస్, టీడీపీ సాన్నిహిత్యం ఇందుకు కారణంగా కనిపిస్తున్నది. తెలుగుదేశం అనుకూల మీడియా రేవంత్‌రెడ్డికి అనుకూలంగా స్పష్టమైన స్టాండ్ తీసుకున్నట్టు బహిరంగ రహస్యమే. ఆ మీడియా సంస్థల కవరేజీ కూడా ఆ రాజకీయ వాదనను అనుసరిస్తున్నది. ఇది తెలంగాణ అస్తిత్వానికి, ఆత్మగౌరవానికి ప్రమాదకరం. చైతన్యవంతమైన తెలంగాణ

తెలుగు దిన పత్రిక https://aksharagalam.com
అక్షరగళం
నిజం..నిర్భయంగా
గ్రేటర్ -హైదరాబాద్

గత పాలకుల నిర్లక్ష్యం వల్ల అలియాబాద్ మున్సిపాలిటీ అభివృద్ధి వెనుకబడింది

- రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

అక్షర గళం, మేడ్చల్ : గత పాలకుల నిర్లక్ష్యం వల్ల అలియాబాద్ మున్సిపాలిటీ అభివృద్ధి వెనుకబడిందని రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి విమర్శించారు. మేడ్చల్ నియోజకవర్గంలోని అలియాబాద్ మున్సిపాలిటీలో జరుగుతున్న ఎన్నికల ప్రచారంలో భాగంగా మేడ్చల్-మల్కాజ్‌గిరి పార్లమెంటరీ ఇంచార్జి, రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి , ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డిలు ప్రచారానికి వచ్చిన సందర్భంగా డీసీసీ అధ్యక్షులు తోటకూర వజ్రేశ్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి వారికి ఘన స్వాగతం పలికారు.అలియాబాద్ మున్సిపాలిటీ పరిధిలో నిర్వహించిన భారీ రోడ్‌షోలో కాంగ్రెస్ పార్టీ జెండాలతో వీధులు మార్మోగిపోయాయి. ప్రజల నుంచి వెల్లువెత్తిన మద్దతు కాంగ్రెస్ పార్టీపై ఉన్న విశ్వాసానికి నిదర్శనంగా నిలిచింది. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా ప్రభుత్వంగా రెండు సంవత్సరాల వ్యవధిలో అనేక సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని తెలిపారు. ఎన్నికల హామీల మేరకు మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, ముఖ్యమంత్రి సహాయ నిధి, గృహజ్యోతి పథకం, కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్, రేషన్ కార్డుల పంపిణీ, ఇందిరమ్మ ఇండ్ల మంజూరు వంటి పథకాలు ప్రజల జీవితాల్లో గణనీయమైన మార్పు తీసుకొచ్చాయని పేర్కొన్నారు.అలాగే మున్సిపాలిటీల్లో కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులు కాంగ్రెస్ ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని అన్నారు. ప్రజల సంక్షేమం, సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్న కాంగ్రెస్ పార్టీకి రానున్న మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు ఘన విజయం అందించాలని ఆయన కోరారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల సంక్షేమమే లక్ష్యంగా రైతులు, కార్మికులు, మహిళలు, యువతకు ఉపయోగపడే పథకాలను అమలు చేస్తూ ప్రజా ప్రభుత్వంగా ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజల జీవితాల్లో ప్రత్యక్ష మార్పు తీసుకువచ్చాయని, దీనిని కార్యకర్తలు ప్రతి గడపకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను చూసి ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు, అలియాబాద్ చైర్మన్ అభ్యర్థి శిరీష కృష్ణారెడ్డిని భారీ మెజారిటీ గెలిపించి ముఖ్యమంత్రి కి కానుకగా ఇవ్వాలని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించి, అలియాబాద్,మూడు చింతలపల్లి ఎల్లంపేట్, మున్సిపాలిటీల పై కాంగ్రెస్ జెండా ఎగరవేయాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తదని ఆయన స్పష్టంగా పేర్కొన్నారు.ఈ ఎన్నికలు కేవలం మున్సిపల్ ఎన్నికలు మాత్రమే కాదని, ప్రజల పక్షాన నిలిచే కాంగ్రెస్ పార్టీకి - ప్రజా వ్యతిరేక శక్తులకు మధ్య జరుగుతున్న పోరాటమని అన్నారు. అలియాబాద్, మూడు చింతలపల్లి, ఎల్లంపేట్ మున్సిపాలిటీల చైర్మన్ పదవిని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుని, నిజమైన అభివృద్ధి పాలనకు నాంది పలకాలని కార్యకర్తలకు మంత్రి గట్టి పిలుపునిచ్చారు. అనంతరం శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ అలియబాద్ మున్సిపాలిటీ అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ పూర్తి సహాయ సహకారం అందిస్తుందని కాంగ్రెస్ పార్టీ తరపున నిలబడిన అభ్యర్థులను మంచి మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, మేడ్చల్ ఇంచార్జ్ జంగయ్య యాదవ్, నక్క ప్రభాకర్ గౌడ్, ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పీసరి మహిపాల్ రెడ్డి,జిల్లా మార్కెట్ కమిటీ చైర్మెన్ నర్సింహా యాదవ్,జిల్లా ఆర్టీఏ సభ్యుడు భీమిడి జైపాల్ రెడ్డి, మేడ్చల్ నియోజకవర్గం బి బ్లాక్ అధ్యక్షుడు వేణుగోపాల్ రెడ్డి,మూడు చింతలపల్లి మున్సిపాలిటీ ఎన్నికల ఇంచార్జ్ ఎన్నికల ఇన్చార్జ్ మాజీ మేయర్ తోటకూర అజయ యాదవ్, అమర్ సింగ్,మూడు చింతలపల్లి మున్సిపాలిటీ అధ్యక్షుడు దోసకాయల వెంకటేష్, అలియాబాద్ మున్సిపాలిటీ అధ్యక్షుడు తుంకి రమేష్,మేడ్చల్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు, స్థానిక మాజీ ప్రజాప్రతినిధులు,పార్టీ కార్యకర్తలు , పెద్ద సంఖ్యలో ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

చిన్నారులతో భిక్షాటనకు చేయించడం చట్టరీత్యా నేరం

- సైబరాబాద్ విమెన్ అండ్ చిల్డ్రన్ సేఫ్టీ వింగ్ డీసీపీ సృజన కరణం

అక్షర గళం, సైబరాబాద్ : చిన్నారులతో భిక్షాటనకు చేయించడం చట్టరీత్యా నేరం. అది తల్లి దండ్రులైనా, సంరక్షకులైనా సరే.. చట్టం నుండి తప్పించుకోలేరని సైబరాబాద్ విమెన్ అండ్ చిల్డ్రన్ సేఫ్టీ వింగ్ డీసీపీ సృజన కరణం స్పష్టం చేశారు. ఇటీవల ఐదుగురు (5) మైనర్ బాలలు సైబర్ టవర్ జంక్షన్ వద్ద ఇదే రీతిలో భిక్షాటన చేయిస్తుండగా సైబరాబాద్ పోలీసులు వారిని క్షేమంగా రక్షించారు. పిల్లల ప్రాణాలను పణంగా పెట్టి వారిని పదే పదే భిక్షాటనకు ప్రేరేపించిన తల్లి దండ్రులపై మాదాపూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి, వారిని జైలుకు పంపారు. రక్షించిన పిల్లలకు బాలల సంరక్షణ సంస్థల సహకారంతో పునరావాసం కల్పించి, వారికి కొత్త జీవితాన్ని అందించామని తెలిపారు. చిన్నారుల చిరునవ్వుల వెనుక దాగున్న విషాదాన్ని దూరం చేసి, వారికి ఉజ్వల భవిష్యత్తును అందించడమే లక్ష్యంగా సైబరాబాద్ పోలీసులు ముందడుగు వేశారు. మహాత్మా గాంధీ వంటి మహనీయుల వేషధారణను భిక్షాటనకు ముసుగుగా వాడుకుంటూ, పసిపిల్లల ప్రాణాలను ప్రమాదంలో పడేస్తున్న తీరుపై సైబరాబాద్ పోలీసులు చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటున్నారు. ట్రాఫిక్ సిగ్నల్స్, రద్దీగా ఉండే రోడ్డు జంక్షన్ల వద్ద చిన్నారులకు మహాత్మా గాంధీ వేషం వేసి, ఒళ్లంతా రంగులు పూసి వారిని భిక్షాటన చేయిస్తున్నా ఘటనలు పోలీసుల దృష్టికి వచ్చాయన్నారు. కేవలం డబ్బు సంపాదన కోసం కన్నవారే తమ పిల్లల హక్కులను కాలరాస్తూ, వాహనాల మధ్య వారిని ప్రమాదంలోకి నెట్టడంపై ఆవేదన వ్యక్తం చేశారు.'రంగుల వల్ల కలిగే శారీరక ఇబ్బందులు, రద్దీ ప్రాంతాల్లో ఉండే ప్రాణాపాయం పిల్లల మానసిక వికాసాన్ని దెబ్బతీస్తాయని' ఆమె పేర్కొన్నారు." పిల్లలు బడిలో ఉండాలి.. భిక్షాటనలో కాదు" అనే నినాదంతో పోలీసులు ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తున్నారు. ఇలాంటి ఘటనలు మీ కంటపడితే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు గానీ లేదా చైల్డ్ లైన్ నెంబర్ 1098 కు గానీ సమాచారం అందించాలని సైబరాబాద్ పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఎస్సీ విద్యార్థులకు కుల, ఆదాయ ధృవీకరణలు వెంటనే జారీ చేయాలి

- మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి

అక్షర గళం, మేడ్చల్ ప్రతినిధి : విద్యార్థులు ప్రీ మెట్రిక్ స్కాలర్ షిప్ నమోదు కోసం ఎస్సీ విద్యార్థులకు కుల, ఆదాయ ధృవీకరణలు వెంటనే జారీ చేయాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి అన్నారు. జిల్లాలోని షెడ్యూల్డ్ కులాల కు చెందిన 9, 10వ తరగతి విద్యార్థుల ప్రీ మెట్రిక్ స్కాలర్ షిప్లు అందించేందుకు అవసరమైన కుల, ధృవీకరణ పత్రాల నమోదు విషయంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక చొరవ చూపాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశమందిరంలో ఏర్పాటు చేసిన సమావేశానికి జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి వినోద్ కుమార్, డిఈఓ విజయ కుమారి, ఎల్డిఎం శివ ప్రసాద్ లతో కలిసి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.ఈ ప్రక్రియలో నమోదు నుండి జారీ వరకు విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించి, అదే విధంగా సంబంధిత తహసీల్దార్లతో సంప్రదించి ధృవపత్రాల జారీలో జాప్యం జరుగకుండా చూడాలని తెలిపారు. విద్యార్థులకు బ్యాంకు అకౌంట్, పోస్టల్ అకౌంట్ తెరిపించడంలో విద్యార్థులకు మార్గనిర్దేశం చేయాలని సూచించారు. ముందుగా జాప్యం లేకుండా స్థానిక విద్యార్థుల కుల, ఆదాయ ధృవీకరణలు పెండింగ్ లో లేకుండా చూడాలని అదేశించారు. పోస్టాఫీస్ లో 10 సంవత్సరాలు నిండిన విద్యార్థుల పేరు మీద వంద రూపాలయలతో అకౌంట్ ఓపెన్ చేసి స్కాలర్ షిప్ కొరకు అకౌంట్ వివరాలు అనుసంధానం చేయాలని, ఈ అకౌంట్ తెరవడానికి ఆధార్, పోన్ నంబరు ఉంటే చాలని వివరించారు.జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి వినోద్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలల్లోని షెడ్యూల్డ్ కులాల కు చెందిన 9, 10 వతరగతి విద్యార్థులు అర్హులు , కుటుంబ ఆదాయం రూ. 2.5 లక్షల లోపు ఉండాలాన్నారు. ఆధార్, కుల, ఆదాయ ధృవీకరణలతో పాటు బోనఫైడ్, పాస్ పోర్టు సైజ్ ఫోటో బ్యాంక్ అకౌంట్/పోస్టల్ అకౌంట్ కలిగి ఉన్న విద్యార్థులుఈ పాస్ వెబ్ సైట్ https://www.tgepass.cgg.gov.in నందు ప్రీ మెట్రిక్ స్కాలర్ షిప్ నమోదు చేసుకోవాలని తెలిపారు. అనంతరం ప్రధానోపాధ్యాయుల సందేహాలకు అదనపు కలెక్టర్ సలహాలు, సూచనలు అందించారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం యెన్నం హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ యెన్నం హరికాంత్ రెడ్డి అందజేత

వెల్దండ ఫిబ్రవరి 04 (అక్షర గళం):

వెల్దండ మండల కేంద్రంలోని చెందిన దాసప్రతి సరస్వతి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న యెన్నం హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ యెన్నం హరికాంత్ రెడ్డి మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి అధైర్య పడకుండా ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు మృతురాలి కుటుంబ సభ్యులకు 5000 వేల రూపాయలు ఆర్థిక సహాయం యెన్నం హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ హరికాంత్ రెడ్డి అందజేశారు ఈ కార్యక్రమంలో రంగనాథం మట్ట మధుసూదన్ గౌడ్ నవీన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కడారి పద్మకు బ్రహ్మరథం పడుతున్న ప్రజలు

- ఎనిమిదవ వార్డును అభివృద్ధి పరుస్తా

కల్వకుర్తి ఫిబ్రవరి 4 (అక్షర గళం):

ఎనిమిదవ వార్డును అన్ని రంగాలలో అభివృద్ధి పరుస్తామని ప్రజలు అవకాశం ఇవ్వాలని వార్డు అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు తమకు సీఎంతో ఉన్న సన్నిత సమనంధాలతో అభివృద్ధి పరుస్తామని కాంగ్రెస్ సెండ్ ఎనిమిదవ వార్డు కౌన్సిలర్ కడారి పద్మ అన్నారు బుధవారం ఎన్నికల్లో ప్రచారంలో భాగంగా ఇంటింటా ప్రచారాన్ని చేశారు ఈ సందర్భంగా ఎనిమిదవ వార్డు ప్రజలు కడారి పద్మకు బ్రహ్మరథం పట్టారు అభివృద్ధిని చూసి ఓటు వేయాలని ఎనిమిదవ వార్డును శరవేగంతో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని అన్నారు.

ఆమె వెంట కాంగ్రెస్ కార్యకర్తలు పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో ప్రచారంలో పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల పట్టుబడ్డ వారికి జైలు శిక్ష జరిమానా

కల్వకుర్తి ఎస్ఐ మాధవరెడ్డి

కల్వకుర్తి ఫిబ్రవరి 4 (అక్షర గళం): మద్యం సేవించి వాహనాలు నడిపిన ఇద్దరికీ జైలు శిక్షతోపాటు జరిమానా విధించినట్లు కల్వకుర్తి ఎస్ఐ మాధవరెడ్డి మీడియాకు బుధవారం తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసును పట్టుబడిన వారిని కోర్టులో హాజరుపరచగా ఇద్దరికీ జైలు శిక్ష జరిమానా ను జూనియర్ సివిల్ జడ్జ్ కావ్య జాడ విధించినట్లు తెలిపారు. ఊరుకొండ మండలం ఇప్పపాడు గ్రామానికి చెందిన కానోజి రఘునందన్ కు నాలుగు రోజులు జైలు శిక్షతోపాటు 600 రూపాయలు జరిమానా విధించారు. పులి శివ కు నాలుగు రోజుల జైలు శిక్ష 600 రూపాయలు జరిమానా విధించినట్లు యేసయ్య తెలిపారు.

స్పీకర్ తీరు రాజ్యాంగానికే గొడ్డలి పెట్టు

హైదరాబాద్,ఫిబ్రవరి 4: ఫిరాయింపు ఎమ్మెల్యేలపై అనర్హత పిటిషన్లను స్పీకర్ వరుసగా కొట్టివేస్తున్న తీరు రాజ్యాంగానికే గొడ్డలిపెట్టని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. సాక్షాత్తూ ముఖ్యమంత్రే స్వయంగా జగిత్యాల బీఆర్ ఎస్ ఎమ్మెల్యే సంజయ్‌కి కండువా కప్పి కాంగ్రెస్‌లో చేర్చుకున్న ఫోటోలు, వీడియోలు కళ్ల ముందు కనిపిస్తున్నా ఆధారాలు లేవని అనర్హత పిటిషన్‌ను తిరస్కరించడం అర్థరహితం అన్నారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై అనర్హత పిటిషన్లను స్పీకర్ కొట్టేయడంపై కేటీఆర్ స్పందించారు. ఈ మేరకు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్‌లో ఓ పోస్ట్ చేశారు. అటు సుప్రీంకోర్టు తీర్పును, ఇటు ప్రజాతీర్పును కాలరాసి గోడదూకిన ఎమ్మెల్యేలపై రాజ్యాంగబద్ధంగా చర్య తీసుకోకుండా ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు నడుచుకోవడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే. ఓవైపు జగిత్యాలలో మున్సిపల్ ఎన్నికల వేళ అసలు కాంగ్రెస్ నేత జీవన్ రెడ్డి దుమ్మెత్తిపోస్తున్న తరుణంలోనే ఫిరాయింపు ఎమ్మెల్యేకు క్లీన్ చిట్ ఇవ్వడం స్పీకర్ పదవికున్న గౌరవాన్ని దెబ్బతీయడమే. పంచాయతీ ఎన్నికల్లో తగిలిన ఘోరమైన ఎదురుదెబ్బతో కోలుకోని కాంగ్రెస్ పార్టీ బైఎలక్షన్స్ అంటే భయపడుతోందని అర్థమైపోయింది. మున్సిపల్ ఎన్నికల్లోనూ ముఖ్యమంత్రి వైఫల్యాలు, మోసాలపై పట్టణ ప్రజల్లో పెద్దఎత్తున వెల్లువెత్తుతున్న ఆగ్రహాన్ని చూసి రేవంత్ సర్కారు వణికిపోతోందని తేలిపోయింది. పార్టీ ఫిరాయింపుల సూత్రధారి ఢిల్లీకి పంపే మూటలకు ఆశపడి మౌనం వహిస్తున్న రాహుల్ గాంధీకి ఇకనుంచి రాజ్యాంగాన్ని పట్టుకుని తిరిగే నైతిక హక్కు లేదు. పట్టపగలే పది మంది బీఆరఎస్ ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించినా ఒక్కరిపై కూడా చర్య తీసుకోకుండా సీఎం నడిపిస్తున్న ఈ వికృత రాజకీయ క్రీడకు ప్రజాక్షేత్రంలోనే గుణపాఠం తప్పదని పేర్కొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహనే ముఖ్యం

- ఆహారపు అలవాట్లు మార్చుకోవాలి
- అవగాహన కోసం షార్ట్ ఫిల్మ్స్ తీస్తా
- క్యాన్సర్ దినోత్సవంలో చిరంజీవి

హైదరాబాద్,ఫిబ్రవరి4: క్యాన్సర్‌పై అందరిలోనూ అవగాహన రావాలని అగ్రనటుడు మెగాస్టార్ చిరంజీవి అన్నారు.శరీరంలో వచ్చే మార్పులు గమనించాలని.. నిర్లక్ష్యం చేయకూడదని చిరంజీవి అన్నారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి చిరంజీవి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అందరూ జీవనశైలిలో మార్పులు చేసుకుని ఆరోగ్యకరమైన వాటిని తినాలని చిరంజీవి అన్నారు. భవిష్యత్తులో క్యాన్సర్‌పై అవగాహన కోసం తాను షార్ట్‌ఫిల్మ్‌లు తీయడానికి కూడా సిద్ధంగా ఉన్నట్లు చిరంజీవి చెప్పారు. అది తన బాధ్యత అని అన్నారు. అందరూ జాగ్రత్తగా ఉంటూ ఈ మహమ్మారిని తరిమికొట్టాలన్నారు. గతంలో నా స్నేహితుడు ఒకరు క్యాన్సర్ బారిన పడితే వెంటనే గమనించి వైద్యం తీసుకున్నాడు. దాన్ని నివారించగలిగాం. ఇప్పుడు పదేళ్ల నుంచి హాయిగా ఉంటున్నాడు. శరీరం చెప్పే మాట అందరూ వినాలి. నాకు క్యాన్సర్ రాదులే అని నిర్లక్ష్యం చేయకూడదు. మన అలవాట్లు, వాతావరణం, వంశపారంపర్యంగా కూడా క్యాన్సర్ వచ్చే అవకాశం ఉంది. మొదటి దశలోనే దాన్ని గుర్తిస్తే 90 శాతం తగ్గించుకునే అవకాశాలు ఉన్నాయి. అమ్మాయిలకు చిన్న వయసులోనే వ్యాక్సిన్‌లు వేయిస్తే కొన్నిరకాల క్యాన్సర్ల బారిన పడకుండా కాపాడొచ్చు. మహిళలు కూడా జాగ్రత్తగా ఉండాలి. వ్యాక్సిన్‌లు తీసుకోవాలి.

ముగ్గురు మంత్రులకు ప్రతిష్టాత్మకం ఖమ్మం

(మొదటిపేజీ తరువాత)

పట్టుకోసం యత్నిస్తున్నారు. మంత్రి పొంగులేటి ప్రచారం ముందున్నారు. మున్సిపల్ ఎన్నికలు కీలక దశకు చేరుకున్నాయి. నామినేషన్ల ఉప సంహరణ పక్రియ ముగియడంతో పోటీలో ఉండే అభ్యర్థుల లెక్క తేలింది. చివరి రోజు ఆయా పార్టీలు తమ క్యాండేట్లకు బీ ఫామ్స్ అందజేయగా, టికెట్ ఆశించి భంగపడిన పలువురు నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. మిగిలిన వారు రెబల్స్ గా మారి బరిలో నిలిచారు. ప్రధాన పార్టీలకు ఆయా పార్టీల గుర్తులు ఇవ్వగా, ఇండిపెండెంట్లకు ఆఫీసర్లు గుర్తులు కేటాయించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఇక రాఝుకీయాలు వేడెక్కాయి. మంత్రి పొంగులేటి ప్రతిష్టాత్మకంగా తీసుకుని ప్రచార ఉధృతి పెంచారు. ఖమ్మం జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల్లో ఒక్క చోట మాత్రమే వార్డు కౌన్సిలర్ ఎన్నిక ఏకగ్రీవమైంది. ఏదులాపురం 15వ వార్డులో సీపీఎం, బీజేపీ అభ్యర్థులు తమ నామినేషన్లను విత్ డ్రా చేసుకోవడంతో కాంగ్రెస్ అభ్యర్థి తమ్మినేని మంగతాయి ఒక్కరే పోటీలో నిలిచారు. దీంతో ఆమె ఎన్నిక ఏకగ్రీవం అయింది. భద్రాద్రికొత్తగూడెం జిల్లాలోని కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్, ఇల్లెందు, అశ్వారావు పేట మున్సిపాలిటీల్లో విత్ డ్రాల అనంతరం 106 డివిజన్లు, వార్డులకు 540 మంది బరిలో నిలిచారు. జిల్లాలోని మధిర, వైరా, సత్తుపల్లి, కల్లూరు, ఏదులాపురం మున్సిపాలిటీల్లో ఎన్నికలు జరుగుతున్నాయి. మొత్తం 117 వార్డులకు 922 నామినేషన్లు దాఖలయ్యాయి. స్క్రూట్నీ తర్వాత 787 నామినేషన్లు చెల్లుబాటు అవుతాయని గుర్తించారు. మధిరలో 22 వార్డులకు 165 దాఖలు కాగా, గడువు ముగిసేసరికి 95 మంది నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. 70 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. కాంగ్రెస్ నుంచి 19 , బీఆరఎస్ తరపున 17 , సీపీఎం 3, సీపీఐ 1, జనసేన 5, బీజేపీ 19, స్వతంత్ర అభ్యర్థులు ఆరుగురు పోటీలో ఉన్నారు. కల్లూరు మున్సిపాలిటీలో 20 వార్డులకు మొత్తం 130 మంది నామినేషన్ దాఖలు చేశారు. 58 మంది ఉపసంహరణ చేసుకోగా, 72 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచారు. వీరిలో బీఆరఎస్ నుంచి 20 మంది, కాంగ్రెస్ నుంచి 20, బీజేపీ 16, బీఎస్పీ 3, ఇండిపెండెంట్లు 13 మంది పోటీ చేస్తున్నారు. ఏదులాపురం మున్సిపాలిటీలో 32 వార్డుల్లో 202 నామినేషన్లు వచ్చాయి. వాటిలో 15వ వార్డు ఎన్నిక ఏకగ్రీవం కాగా, మిగిలిన 31 వార్డుల్లో 108 మంది పోటీలో నిలిచారు. కాంగ్రెస్ తరపున 30 మంది, బీఆరఎస్? 23, సీపీఎం 7, బీజేపీ 24, సీపీఐ 11 వార్డుల్లో పోటీలో అభ్యర్థులను నిలిపాయి. 13 మంది ఇండిపెండెంట్లుగా పోటీ చేస్తున్నారు. సత్తుపల్లిలో 23 వార్డుల్లో స్క్రూట్నీ తర్వాత 124 మంది పోటీలో నిలిచారు. వీరిలో 83 మంది బరిలో ఉండగా, 41 మంది విత్ డ్రా చేసుకున్నారు. కాంగ్రెస్ నుంచి 23, బీఆరఎస్ 22, బీజేపీ 22, జనసేన 4, సీపీఐ 2, సీపీఎం నుంచి ఒక్కరు, ఇండిపెండెంట్లు 9 మంది పోటీలో నిలిచారు. వైరా మున్సిపాలిటీలో 20 వార్డుల్లో మొత్తం 155 మంది నామినేషన్లు వేశారు. వీటిలో 75 మంది విత్ డ్రా చేసుకోగా, 80 మంది ఎన్నికల బరిలో నిలిచారు. ఇక్కడ కాంగ్రెస్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వర్గాలు వేర్వేరుగా నామినేషన్లు దాఖలు చేశారు. చివరి రోజు భట్టి వర్గంలో 12 మందికి బీ ఫామ్స్ దక్కగా, మంత్రి పొంగులేటి వర్గంలో ఐదుగురికి, ఎంపీ రేణుకాచౌదరి వర్గంలో ఒకరికి బీఫామ్ ఇచ్చారు. ఒక వార్డులో సీపీఐ అభ్యర్థికి, మరొక వార్డులో సీపీఎం అభ్యర్థికి మద్దతిస్తూ కాంగ్రెస్ తరపున నామినేషన్లు వేయలేదు. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్, ఇల్లెందు, అశ్వారావు పేట మున్సిపాలిటీల్లో విత్ డ్రాల అనంతరం 540 మంది బరిలో నిలిచారు. వీరికి ఎన్నికల అధికారులు గుర్తులు కేటాయించారు. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్?లో 60 డివిజన్లకు 354 మంది పోటీలో ఉన్నారు. అశ్వారావుపేట మున్సిపాలిటీలో 22 వార్డులకు 78 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు.

కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ఆశీర్వదించండి

మంత్రి వాకిటి శ్రీహరి

ఆమనగల్లు, ఫిబ్రవరి 04 (అక్షర గళం): మున్సిపల్ ఎన్నికల్లో మీ అమూల్యమైన ఓటు కాంగ్రెస్ పార్టీ చేతి గుర్తుపై వేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని రాష్ట్ర పశు సంవర్ధక, క్రీడా శాఖ మంత్రి మంత్రి వాకిటి శ్రీహరి కోరారు. బుధవారం ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డు వెంకటేశ్వర కాలనీ, 8వ బీసీ కాలనీలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన కౌన్సిలర్ అభ్యర్థుల గెలుపు కోసం స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, టీపీసీసీ సభ్యులు, మున్సిపల్ ఇంచార్జీ అయిళ్ల శ్రీనివాస్ గౌడ్ లతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా వార్డుల్లో మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ.. కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తే ఆమనగల్లు మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచి ఆదర్శంగా నిలుపుతామని పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నందున మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే మరింత అభివృద్ధి చేపట్టడానికి వీలుంటుందని తెలిపారు. డంపింగ్ యార్డ్ ను నివాస గృహాల మధ్య నుండి తొలగింప చేస్తామన్నారు. మున్సిపాలిటీలో 15 వార్డులు కాంగ్రెస్ కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా, మార్కెట్ వైస్ ఛైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, డైరెక్టర్ వస్పుల శ్రీశైలం, రవీందర్, మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి, హన్మ నాయక్, మండల అధ్యక్షుడు తెల్గమల్ల జగన్, పట్టణ అధ్యక్షుడు వస్పుల మానయ్య, మార్కెట్ వైస్ ఛైర్మన్ గుర్రం కేశవులు, ఆదివాసి రాష్ట్ర నాయకులు కృష్ణ నాయక్, రవికాంత్ గౌడ్, బాబా, గుజ్జుల మహేష్, కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, తల్లోజు రామకృష్ణ, ఎంగలి ప్రసాద్, వెంకటేష్, మహేష్, కండె సాయి, శేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అందరిలో ఒక్కడిగా ఉంటా..

తొమ్మిదో వార్డు అభ్యర్థి మహేష్

ఆమనగల్లు, ఫిబ్రవరి 04 (అక్షర గళం): వార్డు ప్రజలు ఆశీర్వదించి గెలిస్తే అందరిలో ఒక్కడిగా ఉంటూ అభివృద్ధి చేస్తానని 9వ వార్డు బీజేపీ కౌన్సిలర్ అభ్యర్థి ఎర్రవోలు మహేష్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం వార్డు పరిధిలో ఇంటింటి ప్రచారం నిర్వహించి ప్రజలను ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు సహకారంతో వార్డులో ఉన్న ప్రతీ సమస్యకు పరిష్కారం చూపిస్తామని, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటామన్నారు. వార్డులో సరైన మురుగు కాలువల వ్యవస్థ లేకపోవడంతో మురికినీరు పూర్తిగా రోడ్లపై పారుతుందన్నారు. ఇండ్ల ముందు మురికినీరు నిలుస్తుండడంతో దుర్గం వెదజల్లుతుందన్నారు. కమలం గుర్తుకు ఓటు వేసి గెలిపిస్తే వార్డు ' ప్రజలను పట్టి పీడిస్తున్న దుర్గంధం సమస్య నుంచి ప్రజలకు శాశ్వత విముక్తి కల్పిస్తానన్నారు. కార్యక్రమంలో ధోనాదుల మహేష్, ఉప సర్పంచ్ వరికుప్పల శ్రీను, జజ్జేల ఆనంద్, శ్రీను, పురుగుల శివ, దాస్యం వంశీ, చింటూ, సాయి, సతీష్, శ్రీకాంత్, రమేష్, సురేష్, మహేష్ తదితరులు ఉన్నారు.

అవకాశం ఇవ్వండి.. అభివృద్ధి చేసి చూపిస్తా

ఐదో వార్డు అభ్యర్థి పాపిశెట్టి రాము

ఆమనగల్లు, ఫిబ్రవరి 04 (అక్షర గళం): ఒక్క అవకాశం ఇవ్వండి.. అభివృద్ధి చేసి చూపిస్తానని 5వ వార్డు బీఆర్ఎస్ అభ్యర్థి పాపిశెట్టి రాము అన్నారు. బుధవారం స్థానిక నాయకులతో కలిసి వార్డు పరిధిలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాపిశెట్టి రాము మాట్లాడుతూ.. 11న జరిగే ఎన్నికలో కారు గుర్తుకు ఓటువేసి తనను కౌన్సిలర్ గెలిపించాలని అభ్యర్థించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాలను మోసం చేసిందన్నారు. ప్రతి ఏడాది ఉద్యోగాలు భర్తీ చేసేందుకు జాబ్ క్యాలెండరు ఇస్తామని చెప్పి మాట తప్పిందని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో కారు గుర్తుపై ఓటువేసి తనను అత్యధిక మెజారిటీతో ఐదో వార్డు కౌన్సిలర్ గా గెలిపించాలని కోరారు. ఆశీర్వదించి గెలిపిస్తే వార్డులో డ్రెయినేజీ, తాగునీరు, వీధి లైట్ల సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. వార్డులో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి ఆదర్శ వార్డుగా తీర్చిదిద్దుతానని అన్నారు. కార్యక్రమంలో లండం యాదయ్య, చలిచీమల సతీష్, జంతుక కిరణ్, పూసల భాస్కర్, ధార యాదయ్య, కార్తీక్, శ్రీరాములు, రాఘవేందర్, చింటూ, భరత్, శివ, కృష్ణ, జంగయ్య తదితరులు ఉన్నారు.

సంక్షేమ పథకాలను ఇంటింటికీ వివరించాలి

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు, ఫిబ్రవరి 04 (అక్షర గళం): మున్సిపల్ ఎన్నికలల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయానికి నాయకులు కృషి చేయాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సూచించారు. బుధవారం తొమ్మిదో వార్డులోని శ్రీకాంత్ కాలనీలో టీపీసీసీ సభ్యులు, మున్సిపల్ ఇంచార్జీ అయిళ్ల శ్రీనివాస్ గౌడ్, వార్డు ఇంచార్జీ శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి, ఐదో వార్డు అభ్యర్థి గుర్రం కేశవులు లతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నారాయణరెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి గురించి ఓటర్లకు తెలియజేయాలని ఎమ్మెల్యే సూచించారు. సర్పంచ్ ఎన్నికల మాదిరిగా మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు చైర్మన్ గా గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, గుజ్జుల మహేష్, చేగూరి వెంకటేష్, అబ్దుల్ ఖాదర్, అబ్దుల్ కరీం, ఎంగలి ప్రసాద్, డైరెక్టర్ అజీమ్, విజయ్ నాయక్, విజేందర్, మెకానిక్ బాబా, సురేష్ నాయక్, యోగి, రమేష్, సలీం, రహీం, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

ఆడబిడ్డగా వస్తున్న ఆశీర్వదించండి

నల్లబోతుల అంజలి

ఆమనగల్లు, ఫిబ్రవరి 04 (అక్షర గళం): ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డులో కౌన్సిలర్ గా పోటీ చేయడానికి ఆడబిడ్డగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా వస్తున్నానని ఆదరించి అధిక మెజార్టీతో గెలిపించాలని నల్లబోతుల అంజలి అన్నారు. బుధవారం ఆ వార్డులోని ఆదర్శనగర్ కాలనీ, ఇందిరా నగర్ కాలనీ, పద్మశాలి కాలనీలలో శంకర్ కొండ తండా సర్పంచ్ మండ్లి రాములు, బ్లాక్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ వార్డు ఇన్చార్జ్ రమణారెడ్డి లతో కలిసి చేపట్టిన ఇంటింటి ప్రచారానికి విశేష స్పందన లభించింది. వార్డు ప్రజల నుంచి అనూహ్య స్పందన వ్యక్తమవుతూ ఉండడంతో ఈ సందర్భంగా మంజుల మాట్లాడుతూ.. ఎలాంటి కష్టమొచ్చినా ఆపదలో ప్రజలతో పాటు నిలబడే వ్యక్తిగా ఉంటానన్నారు. 11వ తేదీన జరిగే ఎన్నికలలో చేతి గుర్తుకు ఓటు వేసి అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో అబ్దుల్ అలీమ్, మాజీ సర్పంచ్ అంబర్ సింగ్, ఉప సర్పంచ్ సురేష్ నాయక్, ఎన్ఎస్ఈయుఐ రాష్ట్ర కార్యదర్శి ఎండి ఫరీద్, మన్న గిరి, తోట శ్రీను, రవి, నాజర్, రఫీ, సలీం, కొప్పు రాఘవేందర్, బొబ్బిలి తదితరులు ఉన్నారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అండేకార్ యాదిలాల్

ఆమనగల్లు, ఫిబ్రవరి 04 (అక్షర గళం): మోహినాబాద్ మండలం కేతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన మహిళా న్యాయవాది స్వప్న కుమారిని దారుణంగా హత్య చేసిన నిందితులను వెంటనే శిక్షించాలని ఆమనగల్లు బార్ అసోసియేషన్ అధ్యక్షులు అండేకార్ యాదిలాల్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బుధవారం న్యాయవాదులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యాదిలాల్ మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా న్యాయవాదులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ తీసుకుని న్యాయవాదుల రక్షణ చట్టం రూపొందించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది లక్ష్మణ శర్మ, ఉపాధ్యక్షులు ఏర్పుల రామకృష్ణ, సంయుక్త కార్యదర్శి విజయ్ కుమార్ గౌడ్, కోశాధికారి కొప్పు కృష్ణ, క్రీడా కార్యదర్శి ఏ శేఖర్, సభ్యులు సీనియర్ న్యాయవాదులు గణేష్ గౌడ్, మధు గౌడ్, జగన్ గౌడ్, శిరీష్, శ్రీనివాస్, శ్రీశైలం, సర్దార్ నాయక్. మహేష్, ఆంజనేయులు, శిరీష, శైలజ తదితరులు ఉన్నారు.

తాగి వాహనం నడిపిన వ్యక్తికి జైలు శిక్ష జరిమానా

వెల్దండ ఫిబ్రవరి 04 (అక్షర గళం): మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి జైలు శిక్ష పడిన సంఘటన చోటు చేసుకుంది వివరాల్లోకెళ్తే బుధవారం వెల్దండ మండల పోలీసులు ఎన్ ఫోర్స్ మెంట్ వీధులలో భాగంగా వెల్దండ పోలీస్ స్టేషన్ ఎదుట శ్రీశైలం హైదరాబాద్ జాతీయ రహదారిపై వాహనాలు తనిఖీ చేయుచుండగా వెల్దండ మండల పరిధిలోని కుప్పగండ్ల గ్రామానికి చెందిన గోరేటి శివశంకర్ అనే వాహన దారుడు మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టు పడ్డట్లు ఎస్సై కురుమూర్తి తెలిపారు గోరేటి శివశంకర్ కు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించగా మద్యం సేవించి నట్లు నిర్ధారణ కావడంతో కేసు నమోదు చేసి కల్వకుర్తి కోర్టులో హాజరు పరిచి నట్లు ఎస్సై కురుమూర్తి పేర్కొన్నారు కల్వకుర్తి జూనియర్ సివిల్ న్యాయమూర్తి జాడ కావ్య నిందితునికి రెండు రోజులు సాధారణ జైలు శిక్ష 600 రూపాయలు జరిమానా విధించారని ఎస్సై కురుమూర్తి తెలిపారు ఈ సందర్భంగా ఎస్సై కురుమూర్తి మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడప రాదని మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై కురుమూర్తి అన్నారు.

ఇందిరమ్మ మహిళా శక్తి భవనానికి భూమి పూజ చేసిన సర్పంచ్ మట్ట యాదమ్మ మట్ట వెంకటయ్య గౌడ్

వెల్దండ ఫిబ్రవరి 04 (అక్షర గళం): వెల్దండ మండల కేంద్రంలోని 7వ వార్డులో రూ. 10 లక్షలతో నిర్మిస్తున్న ఇందిరమ్మ మహిళా శక్తి భవనానికి గ్రామ సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్, స్థానిక పాలకవర్గంతో కలిసి గురువారం భూమి పూజ చేశారు అదేవిధంగా.. రూ. 6 లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను ప్రారంభించినట్లు సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భూపతిరెడ్డి, ఉప సర్పంచ్ బన్న మోని శ్రీను, వార్డు సభ్యులు రంగనాథం మల్లేశ్వరి గుద్దేటి కిష్టాల్ పురుషోత్తం చారి వాణి ముదిగొండ రమేష్ కవిత మసిగుండ్ల వెంకటేష్ గోసుల కొండయ్య, బాదేపల్లి రమేష్, పిల్లి దేవేందర్, మారేపల్లి శ్రీను, రేవల్లి మానస రాజు, సిర్సనగండ్ల శేఖర్, జంగిలి సునీత ఆనంద్, నాయకులు రాఘవేందర్ రెడ్డి, ఎండి హమీద్, మట్ట నాగేశ్వర్, కృష్ణ ముదిరాజ్, కాసారపు వెంకటయ్య, పుట్ట యాదయ్య, కొయ్యల పుల్లయ్య, మాసుల బాలరాజ్, మట్ట నిరంజన్, గద్దటి నారాయణ, సుధాకర్, కృపానందం, శేఖర్, శ్రీను, ఈదులపల్లి శ్రీనివాస్, మట్ట భరత్ గౌడ్, అధికారులు పంచాయతీరాజ్ ఏఈ సురేందర్ రెడ్డి, కార్యదర్శి గిరి గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 12 దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

సివిల్ సప్లై గోదాం హమాలి యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ .బాలయ్య

కల్వకుర్తి ఫిబ్రవరి 4 (అక్షర గళం): బిజెపి కేంద్ర ప్రభుత్వ కార్మిక కర్షక ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఫిబ్రవరి 12న జరగబోయే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో సివిల్ సప్లై గోదామ హమాలీలను పాల్గొంటామని తెలియజేస్తూ సివిల్ సప్లై స్టాక్ పాయింట్ కల్వకుర్తి గోదాం ఇన్చార్జి శశిధర్ రావు సార్ కు సమ్మె నోటీస్ యూనియన్ ఆధ్వర్యంలో ఈరోజు ఇవ్వటం జరిగినది.ఈ సందర్భంగా సివిల్ సప్లై గోదాము మోహమాలి రాష్ట్ర అధ్యక్షులు నూకం బాలయ్య మాట్లాడుతూ కేంద్ర బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత కార్పొరేట్ బడా పారిశ్రామికవేత్తలకు దేశ సంపద దోషి పెడుతూ అసంఘటితరంగా కార్మికులకు రైతులకు వ్యవసాయ కూలీలకు నష్టం కలిగించే చట్టాలను అమలు చేయాలని చూస్తున్నదని ముఖ్యంగా నాలుగు లేబర్ కోడ్లను తీసుకువచ్చి గత సంవత్సరం నవంబర్ నుంచి అమల్లోకి తేవటాన్ని కార్మికులు తీవ్రంగా వ్యతిరేకత తెలుపుతున్నారని వాటిని వెనక్కి తీసుకోవాలని అన్నారు. అదేవిధంగా వామపక్షాల పోరాటంతో తెచ్చినటువంటి మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని యధావిధిగా అమలు చేసి వ్యవసాయ కార్మికులను ఆదుకోవాలని, నూతన విద్యుత్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఫిబ్రవరి 12న జరిగే సార్వత్రిక సమ్మెలో యూనియన్లకు అతీతంగా మరియు ఎలాంటి యూనియన్ లేని కార్మికులు కూడా హమాలీ ఆటో వన నిర్మాణం తదితర అసంఘటిత రంగా కార్మికులు రైతులు వ్యవసాయ కీలులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు బి .ఆంజనేయులు సివిల్ సప్లై గోదాం హమాలీ యూనియన్ నాయకులు జంగయ్య యాదయ్య పర్వతాలు బీరయ్య కృష్ణ నరేష్ మల్లేష్ పాల్గొన్నారు.

వార్డు కౌన్సిలర్ గా నన్ను గెలిపిస్తే ఆదర్శ వార్డుగా మారుస్తా... అభ్యర్థి ధార దాసు

కల్వకుర్తి ఫిబ్రవరి 4(అక్షర గలం): గత ప్రభుత్వాలు అసమర్థత వల్ల 11వ వార్డు దశాబ్దాలుగా వెనుక పట్టుతనానికి గురైందని నన్ను 11వ వార్డు ప్రజలు ఆదరించి గెలిపిస్తే అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ వార్డుగా మారుస్తానని కల్వకుర్తి మున్సిపాలిటీ 11వ వార్డు సిపిఐ పార్టీ అభ్యర్థి ధార దాసు ధీమా వ్యక్తం చేశారు. బుధవారం 11వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎన్నికల ప్రచారంలో సిపిఐ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి పులిజాల పరుశురాములతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోరాటాలకు మారుపేరైన సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో ప్రజా సమస్యలపై పోరాటం చేసి ప్రత్యేక నిధులు తీసుకుని వచ్చి 11వ వార్డును అభివృద్ధి పరుస్తానని తెలిపారు. కాంగ్రెస్,టిఆర్ఎస్, బిజెపి పార్టీలు కేవలం రాజకీయ స్వార్థం కోసమే పాకలాడుతున్నాయని అభివృద్ధిని గాలికి వదిలేసారు అన్నారు. వారి పాలనలో ప్రజలకు కనీసం వసతులు కరువయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. తమ పార్టీ అభ్యర్థిని గెలిపిస్తే 11వ వార్డు అన్ని వర్గాల ప్రజలకు కమ్యూనిటీ హాల్ సమావేశాల కోసం నిర్మాణం అలాగే పార్కులు, cc రోడ్లు,డ్రైనేజీ, లైట్లు, నీటి సమస్య వార్డును అన్ని రంగాల్లో సుందరంగా మార్చి ఆదర్శ వార్డుగా మారుస్తానని హామీ ఇచ్చారు.11 వార్డు ప్రజలు సిపిఐ పార్టీకి అండగా నుంచి కొడవలి గుర్తుకు ఓటు వేసి ఆదరించాలని ప్రజలను వేడుకున్నారు. ప్రచారంలో సిపిఐ పార్టీ కార్యకర్తలు గడ్డం శ్రీను పురుషోత్తం, అనిల్, తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి

టీపీసీసీ సభ్యులు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్

ఆమనగల్లు, ఫిబ్రవరి 04 (అక్షర గళం): కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే పార్టీ అభ్యర్థులను గెలిపిస్తాయని టీపీసీసీ సభ్యులు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. బుధవారం 14వ వార్డు అభ్యర్థి కాలే మల్లయ్య కు మద్దతుగా అంబేద్కర్ కాలనీలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడమే కాంగ్రెస్ ధ్యేయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వార్డు ప్రజలకు పూర్తి స్థాయిలో అందే విధంగా తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ వార్డులో ఏ సమస్య వచ్చినా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కాలే మల్లయ్య అందరికీ అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని తెలిపారు. ప్రచార కార్యక్రమంలో మండల అధ్యక్షుడు తెల్గమల్ల జగన్, రాములు, యాదయ్య, డేవిడ్, రాజేందర్, రమేష్ గౌడ్, రఘుపతి, షర్ఫుద్దీన్, కాలే రాకేష్, పర్వతాలు తదితరులు ఉన్నారు.

ఐటీ షేర్లు ఢీలా..



కృత్రిమ మేధ రంగంలో కొత్త పురోగతి భారత ఐటీ షేర్లపై ప్రభావం చూపింది. దాంతో బుధవారం ట్రేడింగ్ ప్రారంభమైన సమయానికి ఇన్ఫోసిస్, టీసీఎస్‌కు చెందిన స్టాక్స్ 6 శాతం మేర పతనమయ్యాయి. విప్రో షేర్లు 4 శాతానికి పైగా కుంగాయి. దూసుకొస్తున్న ఏఐ.. ప్రస్తుత మోడళ్లలో ఎలాంటి మార్పులు తీసుకువస్తుందనే దానిపై ఆందోళన ఈ పరిణామాలకు దారితీసింది. ప్రపంచ టెక్నాలజీ రంగం, సాఫ్ట్‌వేర్ స్టాక్‌స్‌లోని బలహీనతలతో నిన్న నాస్‌డాక్ క్షీణించింది.

ఏఐ సంస్థ యాంథ్రోపిక్ కొత్తగా ఏఐ టూల్‌స్‌ను తీసుకువచ్చింది. అవి డాక్యుమెంట్ రివ్యూస్, డేటా అనాలసిస్ చేయగలవని సంస్థ వెల్లడించింది. ఈ పనులు మొత్తం మామూలుగా భారత ఐటీ కంపెనీలకు అవుట్‌సోర్స్ అవుతుంటాయి. ఈ నేపథ్యంలో యాంథ్రోపిక్ ప్రకటన మదుపర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. దాంతో యూఎస్ ట్రేడింగ్‌లో ఇన్ఫోసిస్, విప్రో ఏడీఆర్‌లు నష్టాలను చవిచూశాయి. బుధవారం ఉదయం భారత్‌లో మార్కెట్లు ప్రారంభం కావడానికి ముందే ప్రతికూల వాతావరణం నెలకొంది. ఇక ట్రేడింగ్ ప్రారంభం కాగానే ఐటీ షేర్లు భారీగా పతనమయ్యాయి.

నష్టాల్లో దేశీయ మార్కెట్ సూచీలు..

ఉదయం 11.45 గంటల సమయంలో దేశీయ మార్కెట్ సూచీలు నష్టాల్లో ఉన్నాయి. సెన్సెక్స్ 130 పాయింట్లు నష్టపోయి, 83,603 వద్ద ట్రేడవుతోంది. నిఫ్టీ 12 పాయింట్లు కోల్పోయి, 25,714 వద్ద కదలాడుతోంది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 90.54గా ఉంది. నిఫ్టీ సూచీలో ఓఎన్‌జీసీ, ట్రెంట్, పవర్ గ్రిడ్ కార్పొరేషన్, ఎటర్నల్, ఎన్‌టీపీసీ షేర్లు లాభాల్లో ఉండగా.. ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, టీసీఎస్, హెచ్‌సీఎల్, విప్రో స్టాక్స్ నష్టాల్లో కొనసాగుతున్నాయి.

ఐటీ షేర్లను భయపెట్టిన ఆంథ్రోపిక్



కృత్రిమ మేధ నైపుణ్యాలపై దిగ్గజ టెక్ కంపెనీలు దృష్టిపెట్టిన వేళ.. 'ఆంథ్రోపిక్' సంస్థ కొత్త ఏఐ టూల్‌ను తీసుకొచ్చి సంచలనం సృష్టించింది. ఈ ప్రకటనతో అమెరికా టెక్ కంపెనీలేగాక.. భారత ఐటీ రంగ షేర్లు కుప్పకూలాయి. ఇన్ఫోసిస్, టీసీఎస్ వంటి ప్రధాన కంపెనీలు దాదాపు 7 శాతం వరకు కుంగిపోయాయంటే.. 'ఆంథ్రోపిక్' ఎలాంటి అలజడి సృష్టించిందో అర్థం చేసుకోవచ్చు. ఇంతకీ ఏంటీ ఏఐ టూల్.? ఎలా పనిచేస్తుంది. 'క్లాడ్ చాట్‌బాట్' సృష్టికర్త, అమెరికా కంపెనీ ఆంథ్రోపిక్.. ఇటీవల 'క్లాడ్ కోపర్క్ ఏజెంట్'కు 11 ఓపెన్ సోర్స్ ప్లగ్‌ఇన్‌లను విడుదల చేసింది. లీగల్, సేల్స్, మార్కెటింగ్, డేటా అనాలిసిస్ వంటి రంగాల్లో ఆటోమేషన్ కోసం ఈ ప్లగ్‌ఇన్‌లు ఉపయోగపడనున్నాయి. ఫైనాన్స్, ప్రొడక్ట్ మేనేజ్‌మెంట్, బయాలజీ రీసెర్చ్, కస్టమర్ సపోర్ట్ వంటి రంగాల్లోనూ ఈ టూల్ కీలకంగా పనిచేస్తుందని కంపెనీ ప్రకటనలో వెల్లడించింది.

ఈ కొత్త అప్‌డేట్లతో ఇకపై 'క్లాడ్ కోపర్క్' అనేది కేవలం చాట్‌బాట్ మాత్రమే గాక.. ఓ టీమ్‌మేట్‌లా పనిచేయనుంది. మన కంప్యూటర్‌పై వర్క్ కూడా చేయగలదు. ఈ ఏజెంట్ ఫైల్‌స్‌ను రీడ్ చేయగలదు. డాక్యుమెంట్లను ఎడిట్ చేయడం, కొత్త ఫైల్స్ క్రియేట్ చేసి, రీనేమ్ చేయడం, ఫోల్డర్లను ఆర్గనైజ్ చేయడం, నోట్‌స్‌ను రిపోర్టులుగా మార్చడం వంటివి చేస్తుంది. రచయితలు, అనలిస్టులు, జర్నలిస్టులు, విద్యార్థులు, ఆఫీసు యూజర్లు దీన్ని ఉపయోగించుకోవచ్చు. ఇక, లాయర్లు, కంపెనీల కోసం ప్రత్యేక టూల్స్ కూడా ఉన్నాయని ఆంథ్రోపిక్ తెలిపింది. సాధారణంగా డాక్యుమెంట్ రివ్యూలు, డేటా అనాలిసిస్ వంటి పనులను మల్టీనేషనల్ కంపెనీలు.. భారత ఐటీ సర్వీస్ ప్రొవైడర్లకు ఔట్‌సోర్సింగ్ కింద అప్పజెప్తుంటాయి. ఇప్పుడు ఆంథ్రోపిక్ ఏఐ టూల్‌తో ఇవన్నీ ఆటోమేటిక్‌గా జరిగే అవకాశం ఉండటం భారత ఐటీ మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. పలితంగా నేటి ట్రేడింగ్‌లో ఇన్ఫోసిస్, ఎల్‌అండ్‌టీ మైండ్ ట్రీ, టీసీఎస్, విప్రో, టెక్ మహింద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఎంఫసిస్, పర్సిస్టెంట్ సిస్టమ్స్ వంటి కంపెనీల షేర్లు భారీగా పడిపోయాయి.

ఈ పరిస్థితిని అనలిస్టులు 'సాస్పోకాలిప్స్ 'గా అభివర్ణిస్తున్నారు. అంటే ' కంపెనీలకు ఏఐ సాయం చేస్తుంది' అనే భావన నుంచి 'కంపెనీలను ఏఐ భర్తీ చేయగలదు' అనే స్థాయికి ఆందోళనలు పెరగడమే ఈ సాస్పోకాలిప్స్. ఇలాంటి ఏఐ టూల్‌స్‌తో సాఫ్ట్‌వేర్, ఐటీ సర్వీస్ కంపెనీల మధ్య పోటీతత్వ విధానాలు మారిపోతాయని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఐటీ కంపెనీల్లో ఉండే డెవలప్‌మెంట్, టెస్టింగ్ వంటి టాస్క్‌లను ఈ టూల్ భర్తీ చేయడంతో ఎంట్రీ లెవల్ ఉద్యోగాలు ప్రమాదంలో పడే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి: ముకేశ్ అంబానీ

ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం ఆర్థిక వృద్ధిలో మరింత ముందుకు వెళ్తోందని రిలయన్స్ ఇండస్ట్రీస్ ఛైర్మన్, ఎండీ ముకేశ్ అంబానీ అన్నారు. గత 20 ఏళ్లుగా దేశంలో శాంతి భద్రతలు స్థిరంగా ఉండడంతో ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెందుతోందన్నారు. పరిశ్రమలకు కావాల్సిన మౌలిక సదుపాయాల వృద్ధి వల్ల స్టార్టప్ సంస్థలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయని పేర్కొన్నారు. ఈ వృద్ధి ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో రిలయన్స్ వంటి కంపెనీలు వందల సంఖ్యలో వస్తాయన్నారు. జియోబ్లాక్‌రాక్ కార్యక్రమంలో అంబానీ మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం ప్రపంచ వేదికపైనా భారత్ కీలక పాత్ర పోషిస్తోందని.. ప్రపంచ దేశాలు భారత్ వైపు చూస్తున్నాయని అంబానీ అన్నారు. దేశానికి స్థిరమైన రెండంకెల వృద్ధి సాధ్యమేనన్నారు. రాబోయే దశాబ్దంలో భారత్ ఇంధన రంగంలో దిగుమతులను దాదాపు 80శాతం తగ్గించుకుంటుందన్నారు. ప్రస్తుతం దేశంలోని ప్రతి గ్రామంలో 5జీ నెట్‌వర్క్ ఉందని, అది కూడా ఇతర దేశాలతో పోలిస్తే చాలా చౌకగా లభిస్తోందని పేర్కొన్నారు.

హెచ్1బీ ఫీజులకు చెక్.. భారత్‌లో గూగుల్ భారీ క్యాంపస్..!

హెచ్ 1బీ వీసాల జారీకి అమెరికా తీసుకొచ్చిన కొత్త నిబంధనలతో టెక్ కంపెనీలకు విదేశీ ఉద్యోగుల నియామకాలు భారంగా మారాయి. ఈ పరిణామాల నేపథ్యంలో దిగ్గజ సంస్థ గూగుల్ కీలక చర్యలు చేపట్టింది. వీసాలు, ప్రభుత్వ అనుమతుల కోసం ఎదురుచూడకుండా భారత్‌లో తమ కార్యకలాపాలను మరింత విస్తరించేందుకు సిద్ధమైంది. ఇందులోభాగంగానే బెంగళూరులో భారీ క్యాంపస్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు బ్లూమ్‌బర్గ్ కథనం వెల్లడించింది. బెంగళూరులోని టెక్ కారిడార్లలో ఒకటైన వైట్‌ఫీల్డ్ ప్రాంతంలో 20వేల మంది ఉద్యోగుల కోసం గూగుల్ భారీ క్యాంపస్‌ను సిద్ధం చేసుకుంటున్నట్లు ఆ కథనం పేర్కొంది. ఇందుకోసం ఇప్పటికే ఓ ఆఫీసు టవర్‌ను గూగుల్ మాతృక సంస్థ ఆల్ఫాబెట్ లీజుకు తీసుకోగా.. మరో రెండు టవర్ల కోసం చర్చలు సాగిస్తున్నట్లు తెలిపింది. ఈ మూడు టవర్లు 24 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్నట్లు తెలుస్తోంది. తొలి టవర్‌లో మరికొన్ని నెలల్లో కార్యకలాపాలు ప్రారంభించనున్నట్లు ఆ కథనం తెలిపింది. మిగతా రెండు టవర్ల నిర్మాణం వచ్చే ఏడాది నాటికి పూర్తి కానుందట. మొదటి భవనం లీజును ఆల్ఫాబెట్ అధికారికంగా ధ్రువీకరించింది. ప్రస్తుతం భారత్‌లో గూగుల్‌కు 14వేల మంది ఉద్యోగులున్నారు. వైట్‌ఫీల్డ్ క్యాంపస్ పూర్తిగా మొదలైతే.. అమెరికా వెలుపల గూగుల్ కార్యకలాపాలకు భారత్ కేంద్రంగా మారనుంది.

ఏఐ రేసుతో భారత్‌పై దృష్టి..

ఇప్పుడు టెక్ కంపెనీలు ఏఐపై దృష్టిపెట్టాయి. ఇలాంటి తరుణంలో మార్కెట్ సృష్టి, అధునాతన ఇంజినీరింగ్ కార్యకలాపాలకు భారత్ ప్రధాన కేంద్రంగా అవతరిస్తోంది. దీంతో దిగ్గజ కంపెనీలు మన దేశంపై దృష్టి సారిస్తున్నాయి. ఇప్పటికే ఏఐ సంస్థ ఆంథ్రోపిక్ భారత్‌లో తమ కార్యకలాపాలను ప్రారంభించింది. గూగుల్ వంటి సంస్థలు కూడా ఆ దిశగా దృష్టిపెట్టాయి. మరోవైపు, హెచ్ 1బీ వీసాలపై ట్రంప్ సర్కారు నిబంధనలు కంపెనీల విస్తరణకు కారణమవుతున్నాయి. హెచ్ 1బీ వీసా దరఖాస్తులకు లక్ష డాలర్ల ఫీజు చెల్లించాలని ట్రంప్ సర్కారు నూతన నిబంధనలు తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. దీంతో కంపెనీలు తమ దీర్ఘకాల నియామక ప్రణాళికలపై పునరాలోచన చేయాల్సిన పరిస్థితి తలెత్తింది. అమెరికాకు భారత ఉద్యోగులను తీసుకోవడం కంటే.. భారత్‌లోనే కార్యకలాపాలను సాగించడం ఉత్తమమని పలు కంపెనీలు భావిస్తున్నాయి. దీనివల్ల వీసా ఆలస్యాలు, ఖర్చులను తప్పించుకోవనేది టెక్ సంస్థల ఆలోచనగా తెలుస్తోంది. ఈ నేపథ్యంలో గూగుల్ కొత్త క్యాంపస్ ప్రణాళికలు చేపట్టినట్లు సమాచారం.

కార్మిక ఆధారిత పరిశ్రమలకు సానుకూలతలు

మనదేశానికి ఐరోపా సమాఖ్య (ఈయూ)తో ఇటీవలే వాణిజ్య ఒప్పందం కుదరగా.. తాజాగా అమెరికాతో కుదురుతోంది. మన ఉత్పత్తులపై టారిఫ్‌ను 50% నుంచి 18 శాతానికి తగ్గిస్తున్నట్లు అమెరికా ప్రకటించింది. ఇది ఎప్పటినుంచి అమల్లోకి వచ్చేదీ తెలుపలేదు. 500 బిలియన్ డాలర్ల (సుమారు రూ.45 లక్షల కోట్ల)కు పైగా విలువైన చమురు, బొగ్గు, సాంకేతికత, వ్యవసాయ ఉత్పత్తులను అమెరికా నుంచి భారత్ కొంటుందని, రష్యా నుంచి చమురు కొనుగోళ్లను భారత్ ఆపేస్తుందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. అమెరికా నుంచి భారత్ ఏయే వ్యవసాయ ఉత్పత్తులు కొనేదీ వెల్లడికాలేదు. 2024లో వ్యవసాయ ఉత్పత్తుల పరంగా భారత్‌తో ఉన్న 1.3 బిలియన్ డాలర్ల (సుమారు రూ.11,700 కోట్ల) అంతరాన్ని ఈ ఒప్పందం తగ్గిస్తుందని అమెరికా వ్యవసాయ మంత్రి బ్రూక్ రోలిన్స్ వెల్లడించారు. అమెరికా నుంచి కొన్ని వ్యవసాయ ఉత్పత్తులకు అనుమతిస్తామని భారతీయ ఉన్నతాధికారి ఒకరు చెప్పినట్లు వార్తా సంస్థలు తెలిపాయి. మనుషులు తినేందుకు వినియోగించేవి కాకుండా ఇథనాల్ ఉత్పత్తికి, పశు పోషణ పదార్థాల తయారీలో వినియోగించేందుకు మొక్కజొన్న సోయాను కొంతమేర అనుమతించొచ్చని సమాచారం.

జీఎం యేతర మొక్కజొన్న, సోయాలు అమెరికాలో పరిమితంగా పండుతూ, ఖరీదు ఎక్కువగా ఉంటాయి. కావాలంటే వీటికి కొంత అనుమతులు ఇస్తారనే ఊహాగానాలున్నాయి. రష్యా చమురు కొనుగోళ్లను భారత్ ఎప్పటిలోగా నిలిపివేస్తుందనేదీ తేలలేదు. దేశంలో తయారీ రంగానికి మాత్రం అమెరికా ఒప్పందంతో నేరుగా ప్రయోజనాలు దక్కనున్నాయి. మార్కెట్ మళ్లీ విస్తృతం కానుంది. కార్మిక ఆధారిత రంగాలైన రత్నాభరణాలు, జౌళి, దుస్తులు వంటి వాటికి గొప్ప ఊరట దక్కినట్లే. కొత్త, నాణ్యమైన ఉద్యోగాలు ఈ రంగాల్లో వస్తాయని కేంద్రం విశ్వసిస్తోంది. రూపాయి బలహీనతలు కూడా ఎగుమతిదార్లకు కలిసి వచ్చే అంశం.

స్వల్పలాభాలతో సూచీలు.. ఐటీ షేర్లు కుదేలు



దేశీయమార్కెట్ సూచీలు బుధవారం ఫ్లాట్‌గా ముగిశాయి నేడు సూచీలు తీవ్ర ఊగిసలాటకు గురయ్యాయి. ఐటీ షేర్లు భారీ నష్టాలను చవిచూశాయి. సెన్సెక్స్ 78 పాయింట్ల లాభంతో 83,817 వద్ద ముగియగా.. నిఫ్టీ 48 పాయింట్లు పెరిగి, 25,776 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్ 83,252 వద్ద (క్రితం ముగింపు 83,739) ప్రారంభమైంది. ఒక దశలో 83,947 వద్ద గరిష్ఠాన్ని తాకింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 9 పైసలు కోల్పోయి..90.41వద్ద స్థిరపడింది. నిఫ్టీ సూచీలో ఓఎన్‌జీసీ, ఎటర్నల్, ట్రెంట్, పవర్ గ్రిడ్ కార్పొరేషన్, ఎన్‌టీపీసీ షేర్లు లాభాల్లో ముగియగా.. ఐటీ రంగ సంస్థలు ఇన్ఫోసిస్, టీసీఎస్, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, విప్రో షేర్లు భారీగా పతనమయ్యాయి. ఏఐ సంస్థ ఆంథ్రోపిక్ కొత్తగా ఏఐ టూల్‌స్‌ను తీసుకువచ్చింది. అవి డాక్యుమెంట్ రివ్యూస్, డేటా అనాలసిస్ చేయగలవని సంస్థ వెల్లడించింది. సాధారణంగా ఇలాంటి పనులను మల్టీ నేషనల్ కంపెనీలు.. భారత ఐటీ సర్వీస్ ప్రొవైడర్లకు ఔట్‌సోర్సింగ్ కింద అప్పజెప్తుంటాయి. ఆంథ్రోపిక్ ప్రకటన మదుపర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. దాంతో మన ఐటీ షేర్లు ఏడు శాతం వరకు కుంగాయి.

నేటి ట్రేడింగ్‌లో సిగాచీ సంస్థ 20 శాతం మేర రాణించింది. ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ అమిత్ రాజ్ సిన్హాకు బెయిల్ రావడం ఇందుకు కారణమైంది. గతేడాది సిగాచీ కర్మాగారంలో జరిగిన పేలుడులో 40 మందికిపైగా ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే.

వెనెజువెలా చమురుతో భారత్‌కు 3 బిలియన్ డాలర్లు ఆదా: ఎస్‌బీఐ రిపోర్టు

అమెరికాతో ట్రేడ్ డీల్‌పై అంగీకారానికి వచ్చిన భారత్.. వెనెజువెలా నుంచి చమురు కొనుగోళ్లకు సిద్ధమైంది. ఈ నిర్ణయంతో మన దేశానికి ఏటా దాదాపు 3 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.27వేల కోట్లు) ఆదా కానుందట. ఈ మేరకు ఎస్‌బీఐ రీసెర్చ్ రిపోర్ట్ వెల్లడించింది. భారత్ చమురు కొనుగోళ్లను రష్యా నుంచి వెనెజువెలాకు మళ్లిస్తే దిగుమతుల వ్యయం భారీగా తగ్గుతుందని ఈ నివేదిక పేర్కొంది.

''వెనెజువెలా చమురు బ్యారెల్‌పై 1012 డాలర్ల వరకు డిస్కౌంట్ లభిస్తే.. ఆ చమురును ఎంచుకోవడం భారత్‌కు లాభదాయకమే. రవాణా వ్యయం, ఇతర ఖర్చులన్నీ తీసేసినా ఏటా మన దేశానికి చమురు దిగుమతుల బిల్లు 3 బిలియన్ డాలర్ల మేర తగ్గుతుంది. ప్రస్తుతం చమురు ధరల డేటా ప్రకారం.. వెనెజువెలా ముడిచమురు బ్యారెల్ ధర దాదాపు 51 డాలర్ల వద్ద ట్రేడ్ అవుతోంది'' అని ఎస్‌బీఐ రీసెర్చ్ తమ నివేదికలో తెలిపింది. భారత్ తమ ముడి చమురు కొనుగోళ్లను రష్యా నుంచి వెనెజువెలాకు మళ్లిస్తే.. ఖర్చు విషయంలో అనేక అంశాలను పరిగణించాల్సి ఉంటుంది. డిస్కౌంట్ ఎంత వస్తుంది.. రవాణా ఖర్చులు, సమయం, బీమా వంటి వాటిని పరిగణనలోకి తీసుకుని మన వ్యయాలను లెక్కలేసుకోవాలి. భౌగోళికపరంగా వెనెజువెలా మనకు చాలా దూరంలో ఉంటుంది. అక్కడి నుంచి చమురు రవాణాకు పట్టే సమయం.. పశ్చిమాసియా దేశాలతో పోలిస్తే ఐదు రెట్లు ఎక్కువ. ఇక, రష్యా నుంచి వచ్చే సమయం కంటే రెట్టింపు. దీంతో వెనెజువెలా చమురుకు రవాణా వ్యయం అదనపు భారం అవుతుందని విశ్లేషకులు చెబుతున్నారు. అయితే, రష్యా నుంచి డిస్కౌంట్ ధరకు చమురు సుదీర్ఘకాలం లభించే అవకాశం లేదనే వాదనలు కూడా ఉన్నాయి. ఉక్రెయిన్‌తో యుద్ధ పరిస్థితులు తగ్గుముఖం పడితే డిస్కౌంట్ ఆగిపోవచ్చని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. ఈ పరిణామాల వేళ వెనెజువెలా చమురు కొనుగోళ్లకు భారత్ మొగ్గు చూపడం ప్రాధాన్యం సంతరించుకుంది.

మారుతి మినీ బస్ ఆగయా?

న్యూఢిల్లీ : కార్ల తయారీలో అగ్రగామి సంస్థయైన మారుతి సుజుకీ దేశీయ మార్కెట్‌కు మినీ బస్సును పరిచయం చేసింది. బడ్జెట్‌ఫ్రెండ్లీ కమర్షియల్ వాహన ఫీచర్స్ కలిగిన మినీ బస్సులో 12 నుంచి 15 మంది ప్రయాణికులు కూర్చోవడానికి వీలుంటుంది. ఈ బస్సు ప్రారంభ ధర రూ.4.99 లక్షలుగా నిర్ణయించింది. సిటీ ట్రావెల్, స్కూల్, ఉద్యోగుల రవాణాకోసం వినియోగించే ఈ మినీ బస్సు లీటర్ పెట్రోల్‌కు 28 కిలోమీటర్ల మైలేజీ ఇవ్వనున్నది. ఈ బస్సు దేశవ్యాప్తంగా కంపెనీకి ఉన్న రిటైల్ అవుట్‌లెట్లలో లభించనున్నది. ఈ బస్సుపై సోషల్ మీడియాలో వార్తలు వస్తున్నాయి. కానీ దీనిపై కంపెనీ స్పందించలేదు.

భారత్‌కు కొన్ని మినహాయింపులు: అమెరికా

అమెరికా పారిశ్రామిక, వ్యవసాయ ఉత్పత్తులపై భారత్ చాలావరకు టారిఫ్‌లు తగ్గించనుందని అగ్రరాజ్య వాణిజ్య ప్రతినిధి జెమిసన్ గ్రీర్ తెలిపారు. అయితే, వ్యవసాయ రంగానికి సంబంధించి కొన్ని దిగుమతులపై ఈ ఒప్పందంలో భారత్‌కు కొంత నియంత్రణ, మినహాయింపులు కల్పిస్తున్నామని వెల్లడించారు. ఆ దిగుమతులు ఏంటనేవి నిర్ణయించేందుకు కలిసి పని చేస్తున్నామని చెప్పారు. అంటే.. ఇరుదేశాల మధ్య వ్యవసాయ ఉత్పత్తులపై టారిఫ్‌లకు (Tariffs) సంబంధించిన చర్చలు ఇంకా ఓ కొలిక్కి రాలేదని జెమిసన్ గ్రీర్ సూచనప్రాయంగా వెల్లడించారు.

ఆ ఉత్పత్తులపై జీరో సుంకాలు..

''ఇరుదేశాల మధ్య ట్రేడ్ డీల్ ఒక అద్భుతమైన అవకాశం. అమెరికా (USA)కు ఇది భారీ విజయం. ఎందుకుంటే భారత్ (India)తో మాకు వాణిజ్య లోటు ఎక్కువగా ఉంది. తాజా ఒప్పందంతో అది తగ్గనుంది. కొన్నిరకాల వ్యవసాయ ఉత్పత్తులు, తయారీ రంగ ఉపకరణాలు, కెమికల్స్, వైద్య పరికరాలపై టారిఫ్‌లు తగ్గించేందుకు భారత్ అంగీకరించింది. అమెరికా పారిశ్రామిక ఉత్పత్తులపై భారత్‌లో దిగుమతి సుంకాలు సగటున 13.5 శాతంగా ఉన్నాయి. ఇప్పుడు అవి సున్నాకు తగ్గనున్నాయి. అగ్రరాజ్యానికి చెందిన కొన్ని రకాల గింజలు, వైన్, స్పిరిట్స్, పండ్లు, కూరగాయాలపై కూడా సుంకాలు జీరోకు దిగి రానున్నాయి'' అని గ్రీర్ వెల్లడించారు. ఈ సందర్భంగా రష్యా నుంచి భారత్ చమురు కొనుగోళ్ల అంశాన్ని కూడా జెమిసన్ గ్రీర్ ప్రస్తావించారు. ''202223కు ముందు మాస్కో నుంచి భారత్ పెద్దగా ముడిచమురు కొనుగోలు చేయలేదు. రష్యాపై పశ్చిమ దేశాల ఆంక్షల నేపథ్యంలో చమురు డిస్కౌంట్‌లో లభించడంతో కొనుగోలు చేపట్టింది. అయితే, గతేడాది చివరిలో మాస్కో నుంచి భారత్ చమురు కొనుగోళ్లు తగ్గుముఖం పట్టాయి'' అని పేర్కొన్నారు.

భారత్ 500 బిలియన్ డాలర్ల పెట్టుబడులు..

ఈ వాణిజ్య ఒప్పందంపై వైట్‌హౌస్ హర్షం వ్యక్తం చేసింది. అమెరికాకు చెందిన పలు రంగాల్లో భారత్ 500 బిలియన్ డాలర్ల వరకు పెట్టుబడులు పెట్టేందుకు అంగీకారం కుదిరిందని పేర్కొంది. ''రష్యా నుంచి చమురు కొనుగోళ్లు ఆపేస్తామని భారత్ హామీ ఇచ్చింది. అదే సమయంలో అమెరికా, వెనెజువెలా నుంచి చమురు దిగుమతి చేసుకుంటామని చెప్పింది. ఇది అగ్రరాజ్య ప్రజలకు ప్రత్యక్షంగా లబ్ధి చేకూర్చనుంది'' అని వైట్‌హౌస్ ప్రెస్ సెక్రెటరీ కరోలిన్ లీవిట్ తెలిపారు.

పాట్ కమిన్స్ ఐపీఎల్ కి దూరమయ్యే చాన్స్!



ఐపీఎల్ 2026 సీజన్ ప్రారంభానికి ముందే సన్‌రైజర్స్ హైదరాబాద్ (అభిమానులకు మింగుడుపడని వార్త అందుతోంది. జట్టును ముందుండి నడిపించే కెప్టెన్, ఆస్ట్రేలియా స్టార్ ఆల్ రౌండర్ పాట్ కమిన్స్ ఈ మెగా టోర్నీకి దూరమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. వెన్నునొప్పి సమస్య తలెత్తడమే ఇందుకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. మార్చి 26 నుంచి ఐపీఎల్ సీజన్ 19 ప్రారంభం కానుంది. అయితే, అంతకంటే ముందే హైదరాబాద్ ఫ్రాంచైజీ కెప్టెన్ ఇబ్బందుల్లో పడటం ఫ్యాన్స్‌ను ఆందోళనకు గురిచేస్తోంది. ప్రస్తుతం క్రికెట్ ప్రపంచమంతా టీ20 ప్రపంచకప్ 2026 కోసం సిద్ధమవుతోంది. అయితే, వెన్నునొప్పి కారణంగా కమిన్స్ ఇప్పటికే ఈ మెగా ఈవెంట్‌కు దూరమయ్యాడు. ప్రపంచకప్ ముగిసిన వెంటనే ఐపీఎల్ ప్రారంభం కానుండటంతో, అప్పటికి ఆయన కోలుకుంటాడా లేదా అన్నది సందేహంగా మారింది. తను ఐపీఎల్ ఆడటంపై పాట్ కమిన్స్ స్వయంగా క్లారిటీ ఇచ్చారు. "ప్రస్తుతానికి నేను ఏమీ చెప్పలేను. త్వరలో మరోసారి స్కాన్ చేయించుకోవాలి. నా వెన్నెముక ఎంత వేగంగా కోలుకుంటుందనే దానిపైనే ఐపీఎల్‌లో నా భాగస్వామ్యం ఆధారపడి ఉంటుంది. పూర్తి ఫిట్‌నెస్ సాధిస్తేనే మైదానంలోకి దిగుతాను" అని ఆయన పేర్కొన్నారు. ఆస్ట్రేలియా బోర్డు నిబంధనల ప్రకారం.. సెంట్రల్ కాంట్రాక్ట్ ఉన్న ప్లేయర్లు పూర్తి ఫిట్‌గా ఉంటేనే విదేశీ లీగ్‌లలో ఆడేందుకు అనుమతిస్తారు. మార్చి నెలాఖరు నాటికి కమిన్స్ ఫిట్‌నెస్ సాధించకపోతే, క్రికెట్ ఆస్ట్రేలియా అతన్ని భారత్‌కు పంపే అవకాశం లేదు. ఒకవేళ కమిన్స్ దూరం అయితే, హైదరాబాద్ జట్టు కొత్త కెప్టెన్‌ను వెతుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

డబ్ల్యూపీఎల్ ఫైనల్ చేరిన దిల్లీ క్యాపిటల్స్

డబ్ల్యూపీఎల్‌లో దిల్లీ క్యాపిటల్స్? మరోసారి ఫైనల్‌కు దూసుకెళ్లింది. వడోదర వేదికగా గుజరాత్‌తో జరిగిన ఎలిమినేటర్ మ్యాచ్‌లో 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. 169 పరుగుల లక్ష్యాన్ని దిల్లీ 15.4 ఓవర్లలో ఛేదించి వరుసగా నాలుగోసారి ఫైనల్?కు చేరింది. దిల్లీ గురువారం జరిగే ఫైనల్లో బెంగళూరును ఢీకొంటుంది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్?కు దిగింది గుజరాత్‌ను జెయింట్స్.? 7 వికెట్ల కోల్పోయి 168 పరుగులు చేసింది. దిల్లీ బౌలర్లు అంతకుముందు గుజరాత్ జెయింట్స్‌కు కళ్లెం వేశారు. ఓపెనర్ బెత్ మూనీ నిలవడంతో జెయింట్స్ పోటీ ఇచ్చే స్కోరు చేయగలిగింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్‌ను బౌలర్లు ఒత్తిడికి గురిచేశారు. ఆరంభలోనే గుజరాత్?కు పెద్ద షాక్ తగిలింది. రెండో ఓవర్?లోనే ఓపెనర్ సోఫీ డివైన్?ను పెవిలియన్?కు చేర్చింది షినెలి హెన్రీ. దీంతో సోఫీ ఆరు పరుగులకే వెనుదిరిగింది. జాగ్రత్తగా ఆడుతున్న మూనీకి తోడుగా అనుష్క శర్మ నిలిచింది. కానీ అది ఎక్కువ సేపు నిలవలేదు. ఆరో ఓవర్లో అనుష్క, ఆష్లీ గార్డ్‌నర్‌లను నందని శర్మ వరుస బంతుల్లో పెవిలియన్?కు చేర్చింది. 9వ ఓవర్లో కనికను మిన్ను మణి వెనక్కి పంపింది. దీంతో 9 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి 60 పరుగులే చేయగలిగింది గుజరాత్.అయితే వికెట్లు పోతున్నా మూనీ మాత్రం గ్రీజులో నిలిచింది. కానీ దిల్లీ బౌలర్ల కట్టడికి ధీటుగా ఆడలేకపోయింది. ఆమెకు ఎట్టకేలకు వేర్‌హామ్ జోడి కుదరింది. దీంతో ఎదురుదాడికి దిగిన వేర్‌హామ్ మూడు ఫోర్లు, ఓ సిక్స్‌తో ఇన్నింగ్స్‌కు ఊపునిచ్చింది. కానీ గుజరాత్ ఇన్నింగ్స్ జోరందుకుంటున్న సమయంలో వేర్‌హామ్‌ను షినెలి ఔట్ చేసింది. అయిదో వికెట్ భాగస్వామ్యానికి 61 పరుగుల వద్ద తెరపడింది. 17వ ఓవర్లో వేర్‌హామ్ వెనుదిరిగే సమయానికి గుజరాత్ స్కోరు 120. వెంటనే పుల్మాలి కూడా ఔట్ అయ్యింది. కష్వీ గౌతమ్‌తో కలిసి మూనీ జట్టు స్కోరు 160 దాటించింది. ఏడో వికెట్‌కు మూనీతో కలిసి 39 పరుగులు జోడించిన కష్వీ ఆఖరి ఓవర్లో నిష్క్రమించింది. మూనీ, కష్వీ బ్యాట్లు ఝుళిపించడంతో ఆఖరి రెండు ఓవర్లలో గుజరాత్‌కు 61 పరుగులొచ్చాయి.169 పరుగుల టార్గెట్?తో బరిలోకి దిగిన దిల్లీ 15 ఓవర్లకే లక్ష్యాన్ని ఛేదించింది. దిల్లీ బ్యాటర్లపై గుజరాత్ బౌలర్లు ప్రభావం చూపలేకపోయారు. బౌండరీల మోత మోగించిన ఓపెనర్లు లిజెలీ, షెఫాలి 21 బంతుల్లో ఏడు ఫోర్లు కొట్టి స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. లిజెలి మూడు ఫోర్లు, షెఫాలి రెండు ఫోర్లు బాదడంతో ఓ ఓవర్లో రేణుక 21 పరుగులు సమర్పించుకుంది. దిల్లీ 7 ఓవర్లకే 89 పరుగులు చేసింది. జార్జియా వేర్‌హామ్ వేసిన తర్వాతి ఓవర్లోనే ఓపెనర్లు ఇద్దరూ పెవిలియన్?కు చేరారు. వోల్వార్ట్ 24 బంతుల్లో 32 పరగులు చేసి నాటౌట్?గా నిలిచింది. జెమీమా రెండో వికెట్‌కు 68 పరుగులు జోడించి, దిల్లీని విజయం వైపు నడిపించారు. షాట్లతో అలరించిన జెమీమా 15వ ఓవర్లో ఔట్ అయ్యింది. మరిజేన్‌తో కలిసి వోల్వార్ట్ మ్యాచ్?ను పూర్తి చేసింది. 15.4 ఓవర్లలో 3 వికెట్లు మాత్రమే కోల్పోయి అలవోకగా లక్ష్యాన్ని అందుకుంది. జెమీమాకు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ' అవార్డు లభించింది. గురువారం జరిగే ఫైనల్లో బెంగళూరును ఢీకొంటుంది. దిల్లీ డబ్ల్యూపీఎల్ తొలి మూడు సీజన్లలోనూ ఫైనల్ చేరినా, కప్పు గెలవలేకపోయింది. ఈసారైనా విజేతగా నిలుస్తుందో లేదో చూడాలి.

వార్మప్ మ్యాచ్‌లో ఇషాన్ కిషన్ ఊచకోత

టీమిండియా విధ్వంసకర బ్యాటర్ ఇషాన్ కిషన్ దుమ్మురేపాడు. ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 నేపథ్యంలో సౌతాఫ్రికాతో ముంబై వేదికగా జరుగుతున్న వార్మప్ మ్యాచ్‌లో ఇషాన్ కిషన్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. 20 బంతుల్లోనే 53 రన్స్ చేశాడు.న్యూజిలాండ్‌తో టీ20 సిరీస్‌లో అద్వితీయమైన ప్రదర్శన కనబర్చిన ఇషాన్ కిషన్ అదే జోరును కొనసాగించాడు. ఓపెనర్‌గా ప్రమోషన్ అందుకొని వామప్ మ్యాచ్‌లో సత్తా చాటాడు. సహచర ఓపెనర్ అభిషేక్ శర్మతో కలిసి ఒకే ఓవర్లో 29 పరుగులు చేశాడు.అన్రిచ్ నోకియా వేసిన ఐదో ఓవర్ తొలి బంతికి అభిషేక్ సిక్స్ కొట్టి రెండో బంతికి సింగిల్ తీసుకున్నాడు. ఆ తర్వాత ఇషాన్ కిషన్ వరుసగా 6, 6, 4, 6 బాదాడు. 7 సిక్సులు, 2 ఫోర్లతో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకొని రిటైర్డ్ ఔట్‌గా పెవిలియన్ చేరాడు. ఐసీసీ టీ20 ప్రపంచకప్‌లో ఇషాన్ కిషన్ టీమిండియా ఓపెనర్‌గా బరిలోకి దిగుతాడని ఈ మ్యాచ్ ద్వారా టీమ్ మేనేజ్‌మెంట్ హింట్ ఇచ్చింది.

ఐసీసీలో ఒంటరిగా మిగిలిన పాక్!

టీ20 ప్రపంచ కప2026లో భారత్‌తో ఆడటానికి పాకిస్తాన్ సుముఖత చూపడం లేదు. పాకిస్తాన్ ప్రభుత్వం తమ జాతీయ క్రికెట్ జట్టు టీ 20 ప్రపంచ కప్ టోర్నమెంట్‌లో ఆడుతుందని, కానీ ఫిబ్రవరి 15న భారత్‌తో తలపడబోదని ఆదివారం ప్రకటించింది. ఒక వైపు, ఈ మ్యాచ్‌ను బహిష్కరించడం వల్ల పాకిస్తాన్ తీవ్రమైన నష్టాలను చవిచూడవచ్చు. ఐసీసీ నుంచి ఆంక్షలను కూడా ఎదుర్కోవలసి రావచ్చు. నిబంధనల ప్రకారం, పాకిస్తాన్ టోర్నమెంట్‌లో ఒక మ్యాచ్‌ను మాత్రమే బహిష్కరించగలదా అనే ప్రశ్న కూడా తలెత్తుతుంది. అయితే, పాకిస్తాన్ క్రికెట్ బోర్డు ఇంకా అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ కి లిఖితపూర్వకంగా సమాచారం ఇవ్వలేదు. ఇంతలో, పాకిస్తాన్‌ను షాక్‌కు గురిచేసే ఒక నివేదిక వెలువడింది. భారత్‌తో జరిగే మ్యాచ్‌ను బహిష్కరించాలనే తన ప్రయత్నంలో పాకిస్తాన్‌కు ఏ దేశం నుంచి కూడా మద్దతు లభించడం లేదని ఒక మీడియా నివేదిక పేర్కొంది. ఐసిసి బోర్డులో అది ఒంటరిగా ఉంది. పాకిస్తాన్ అనేక దేశాలను సంప్రదించిందని, కానీ అన్నీ అది సరికాదని తోసిపుచ్చాయని నివేదిక పేర్కొంది. ఈ విషయంపై పాకిస్తాన్ ప్రపంచ క్రికెట్‌లో పూర్తిగా ఒంటరిగా మారింది. ఇతర దేశాల క్రికెట్ బోర్డులు పీసీబీపై కఠినంగా స్పందించాయని నివేదిక పేర్కొంది. సరైన కారణం లేకుండానే భారత్‌తో జరిగే మ్యాచ్‌ను పాకిస్తాన్ బహిష్కరిస్తోందని వారంతా చెబుతున్నారు. పాకిస్తాన్ అనవసరంగా ఈ సంక్షోభాన్ని సృష్టించింది. ఈ విషయంలో పాకిస్థాన్‌కు చట్టపరమైన హక్కులు లేవు. ఐసిసి నిబంధనల ప్రకారం, ఒక జట్టు మైదానంలోకి దిగకపోతే, వాకోవర్ నిబంధన అమలులోకి వస్తుంది. ఫిబ్రవరి 15న కొలంబోలో భారత్‌పాకిస్తాన్ మ్యాచ్ జరగాల్సి ఉంది. పాకిస్తాన్ జట్టు ఇప్పటికే పాల్గొనడానికి నిరాకరించింది. టీం ఇండియా రెండు పాయింట్లు కోరుకుంటే, పాకిస్తాన్‌పై వాకోవర్ పొందడానికి వారు మ్యాచ్ కోసం మైదానంలో ఉండాలి. అటువంటి పరిస్థితిలో, పాకిస్తాన్ భారీ నష్టాన్ని చవిచూస్తుంది. వాక్ ఓవర్ జరిగితే, పాకిస్తాన్ పూర్తి 20 ఓవర్లు బ్యాటింగ్ చేసి 0 పరుగులు చేసినట్లుగా పరిగణిస్తారు. ఇది వారి రన్ రేట్‌ను గణనీయంగా ప్రభావితం చేస్తుంది. భారతదేశం పాకిస్తాన్ మ్యాచ్‌లు లాభాలకు పర్యాయపదాలు. ప్రసారకులు (జియో హాట్‌స్టార్ వంటివి) ప్రకటన ఆదాయంలో మాత్రమే USవి2530 మిలియన్లు కోల్పోవచ్చని నివేదికలు చెబుతున్నాయి. ఒప్పందం ప్రకారం, ఈ నష్టానికి ఐసీసీ బాధ్యత వహిస్తుంది. అయితే, ఈ నష్టాన్ని పాకిస్తాన్‌పై విధించే హక్కు ఐసీసీకి ఉంది. పాకిస్తాన్ వార్షిక ఆదాయ వాటాపై కూడా ఐసీసీపరిమితులు విధించవచ్చు. ఇప్పుడు వస్తున్న వివిధ నివేదికల ప్రకారం, ఈ కేసులో పాకిస్తాన్‌పై ఐసిసి కఠినమైన జరిమానాలు విధించవచ్చు. ఇతర దేశాల మద్దతు లేకపోవడం వల్ల, ఐసిసి బోర్డు సమావేశంలో పాకిస్తాన్ భారీ జరిమానాను ఎదుర్కోవలసి ఉంటుంది. పాకిస్తాన్ తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే, ఐసిసి సుమారు వి38 మిలియన్ల జరిమానా విధించవచ్చు. పాకిస్తాన్ కూడా నిషేధాన్ని ఎదుర్కోవలసి ఉంటుంది. ఇది జరిగితే, పిసిబి దివాలా తీయడం ఖాయం.

పాకిస్థాన్ నీచపు బుద్ధే అంత!!

టీమిండియా మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్

ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా భారత్‌తో మ్యాచ్‌ను బహిష్కరిస్తున్నామని ప్రకటించిన పాకిస్థాన్‌పై టీమిండియా మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. పాకిస్థాన్ నీచపు బుద్ధే ఈ వివాదానికి కారణమని తెలిపాడు. నాలుగు రోజుల్లో పాక్ దారికొస్తుందని అభిప్రాయపడ్డాడు. కచ్చితంగా భారత్, పాక్ మ్యాచ్ జరుగుతుందని, ఆ మ్యాచ్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నానని తెలిపాడు.భద్రతా కారణాల నేపథ్యంలో భారత్‌లో పర్యటించలేమని, తమ మ్యాచ్‌లను శ్రీలంకకు తరలించాలని బంగ్లాదేశ్ చేసిన విజ్ఞప్తిని ఐసీసీ తోసిపుచ్చింది. దాంతో ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 నుంచి బంగ్లాదేశ్ తప్పుకోగా.. ఆ జట్టు స్థానంలో స్కాట్లాండ్‌కు ఐసీసీ అవకాశం కల్పించింది. అయితే ఈ నిర్ణయాన్ని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు తప్పుబట్టింది. బంగ్లాదేశ్‌కు సంఘీభావంగా భారత్‌తో మ్యాచ్‌ను బహిష్కరిస్తున్నట్లు ప్రకటించింది.తాజాగా ఈ వ్యవహారంపై తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా మాట్లాడిన అశ్విన్.. పాకిస్థాన్ తీరును తప్పుబట్టాడు. 'వందకు 100 శాతం భారత్, పాకిస్థాన్ మ్యాచ్ జరుగుతుంది. మరో నాలుగైదు రోజుల్లో పాకిస్థాన్ దారికొస్తుంది. భారత్, పాక్ మ్యాచ్ చూడాలని నేను ఆసక్తిగా ఎదురుచూస్తున్నా.

వైభవ్ సూర్యవంశీ విధ్వంసకర హాఫ్ సెంచరీ

టీమిండియా టీనేజ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ దుమ్మురేపాడు. అండర్ 19 ప్రపంచకప్ 2026లో భాగంగా అఫ్గానిస్థాన్‌తో జరిగిన సెమీఫైనల్లో విధ్వంసకర హాఫ్ సెంచరీతో సత్తా చాటాడు. 311 పరుగుల భారీ లక్ష్య ఛేదనకు దిగిన టీమిండియాకు అదిరిపోయే ఆరంభాన్ని అందించాడు. 33 బంతుల్లో 9 ఫోర్లు, 4 సిక్స్‌లతో 68 పరుగులు చేసి క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు. తొలి వికెట్‌కు 90 పరుగుల భాగస్వామ్యాన్ని అందించాడు. క్రీజులో ఉన్నంత సేపు అఫ్గాన్ బౌలర్లకు చెమటలు పట్టించాడు.ఎదుర్కొన్న 33 బంతుల్లోనే క్రికెట్‌లో ఉన్న షాట్స్ అన్ని ఆడాడు. తన ట్రేడ్ మార్క్ పుల్ షాట్‌తో పాటు ఫ్లిక్, కవర్ డ్రైవ్, అన్ డ్రైవ్‌లతో బౌండరీలు రాబట్టాడు. అతను కొట్టిన నాలుగు సిక్స్‌లు ఈ మ్యాచ్‌కే హైలైట్‌గా నిలిచాయి. 22 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద అతను ఇచ్చిన సునాయస క్యాచ్‌ను అఫ్గాన్ ఫీల్డర్ ఉజైరుల్లా నియాజై వదిలేసాడు. ఈ అవకాశంతో చెలరేగిన అతను 24 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్స్‌లతో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు.అనంతరం మరో రెండు బౌండరీలు, సిక్స్ బాదిన సూర్యవంశీ.. పుల్ షాట్ ఆడబోయి క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు. తన ప్రధాన బలమైన పుల్ షాట్ కొన్ని సార్లు అతనికి బలహీనతగా మారుతుంది.

అండర్-19 వన్డే ప్రపంచకప్ ఫైనల్‌కు భారత్

అఫ్గానిస్థాన్‌పై 7 వికెట్ల తేడాతో ఘనవిజయం

అండర్ 19 వన్డే ప్రపంచ కప్‌లో భారత్ వరుస విజయాలతో అదరగొడుతోంది. బుధవారం జరిగిన సెమీఫైనల్ పోరులో అఫ్గానిస్థాన్‌పై 7 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించి ఫైనల్‌కు దూసుకెళ్లింది. ఉత్కంఠభరితమైన ఈ మ్యాచ్‌లో అఫ్గాన్ నిర్దేశించిన 311 పరుగుల భారీ లక్ష్యాన్ని భారత్ కేవలం 41.1 ఓవర్లలోనే ఛేదించింది.భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు ఓపెనర్లు కళ్లు చెదిరే ఆరంభాన్ని ఇచ్చారు. ఓపెనర్ ఆరోన్ జార్జ్ (115; 104 బంతుల్లో) సెంచరీతో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. కాగా యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ (68; 33 బంతుల్లో) అఫ్గాన్ బౌలర్లపై విరుచుకుపడి ఇన్నింగ్స్‌ను పరుగులు పెట్టించాడు. కెప్టెన్ ఆయుష్ మాత్రే (62) బాధ్యతాయుతంగా ఆడి అర్ధసెంచరీ పూర్తి చేశాడు. చివర్లో విహాన్ మల్హోత్రా (38 నాటౌట్) విన్నింగ్ షాట్ కొట్టి మ్యాచ్?ను పూర్తి చేశాడు.అంతకుముందు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న అఫ్గానిస్థాన్ నిర్ణీత 50 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 310 పరుగులతో భారీ స్కోర్? చేసింది. ఫైజల్ షినోజాదా (110), ఉజైరుల్లా (101 నాటౌట్) అద్భుత శతకాలతో భారత బౌలర్లను ఆడుకున్నారు. వీరిద్దరూ మూడో వికెట్‌కు 148 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి జట్టుకు భారీ స్కోరు అందించారు. ఉస్మాన్ సాదత్ (39), ఖలీద్ అహ్మద్జాయ్ (31) కూడా బాగానే ఆడారు. అఫ్గాన్ చివరి 10 ఓవర్లలో ఏకంగా 111 పరుగులు చేయడం గమనార్హం. భారత బౌలర్లలో కనిష్క్ చౌహాన్, దీపేశ్ దేవేంద్రన్ చెరో రెండు వికెట్లు తీశారు. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న అఫ్గానిస్థాన్‌కు ఓపెనర్లు ఉస్మాన్ సదత్(39), ఖలిద్ అహ్మద్‌జాయ్(31) శుభారంభాన్ని అందించారు. తొలి వికెట్‌కు 53 పరుగుల భాగస్వామ్యాన్ని అందించారు. ఈ జోడిని దీపేష్ దేవంద్రన్ విడదీసాడు. ఖలిద్‌ను క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. మరో ఓపెనర్ ఉస్మాన్‌తో కలిసి ఫైసల్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. హాఫ్ సెంచరీకి చేరువైన ఉస్మాన్‌ను కాన్షిక్ చౌహాన్ ఔట్ చేశాడు. దాంతో క్రీజులోకి ఉజైరుల్లా నియాజై రాగా.. ఇద్దరూ కలిసి భారత బౌలర్లను చెడుగుడు ఆడారు.ఈ క్రమంలో 55 బంతుల్లో హాఫ్ సెంచరీ సాధించిన ఫైసల్.. అనంతరం మరింత దూకుడుగా ఆడి మరో 31 బంతుల వ్యవధిలోనే సెంచరీ పూర్తి చేసుకున్నాడు. మరోవైపు కాస్త నిదానంగా ఆడిన ఉజైరుల్లా నియాజై 63 బంతుల్లో హాఫ్ సెంచరీ సాధించాడు. 148 పరుగుల భాగస్వామ్యంతో క్రీజులో పాతుకుపోయిన ఈ జోడీని దీపేష్ విడదీసాడు. అద్భుతమైన బంతితో సెంచరీ హీరో ఫైసల్‌ను క్లీన్ బౌల్డ్ చేశాడు. అజిజుల్లా మియకిల్‌తో కలిసి నియాజై చెలరేగాడు. భారీ సిక్సర్లతో భారత బౌలర్లపై విరుచుకుపడి 85 బంతుల్లో శతకం సాధించాడు. హాఫ్ సెంచరీ నుంచి శతకం పూర్తి చేసుకోవడానికి అతనికి 22 బంతులే పట్టింది. ఈ విధ్వంసంతోనే అఫ్గాన్ 310 పరుగుల భారీ స్కోర్ చేసింది. దీపేష్, కాన్షిక్ చౌహాన్ మినహా భారత బౌలర్లంతా విఫలమయ్యారు.

ప్రపంచ వరల్డ్ కప్ 2027లో ఆడటం ఖాయం!

పద్మశ్రీ అవార్డుపై రోహిత్ శర్మ భావోద్వేగం

ప్రపంచ క్రికెట్‌లో హిట్‌మ్యాన్‌గా పేరుగాంచిన భారత మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ పద్మశ్రీ అందుకున్నప్పుడు భావోద్వేగానికి గురయ్యాడు . ఆయన చేసిన ప్రకటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. తన దేశం కోసం ట్రోఫీలు గెలవడానికి తాను ప్రయత్నిస్తూనే ఉంటానని రోహిత్ శర్మ చెబుతున్నాడు. రోహిత్ టెస్ట్, టీ20 ఫార్మాట్ నుంచి రిటైర్ అయ్యాడు, కానీ వన్డేలు ఆడుతూనే ఉన్నాడు. 2027 వన్డే ప్రపంచ కప్ వచ్చే ఏడాది జరగనుంది. అందులో ఆడతానని చెప్పకనే చెప్పాడు. ప్రపంచకప్ గెలవడం రోహిత్ కల. పద్మశ్రీ అవార్డును పొందడం ఒక ప్రత్యేక క్షణంగా అభివర్ణించిన రోహిత్ శర్మ, తన క్రికెట్ కెరీర్‌లో తనకు మద్దతు ఇచ్చిన వారందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపాడు. దూరదర్శన్ స్పోర్ట్స్ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ Xలో షేర్ చేసిన వీడియోలో, రోహిత్ శర్మ మాట్లాడుతూ, "పద్మశ్రీని అందుకోవడం నాకు , నా కుటుంబానికి చాలా ప్రత్యేకమైన క్షణం. ఈ గౌరవం కల్పించిన భారత ప్రభుత్వానికి ధన్యవాదాలు. నా కెరీర్‌లో ముఖ్యమైన పాత్ర పోషించిన వారందరికీ నేను కృతజ్ఞతలు తెలుపుతున్నాను. నా దేశం కోసం మ్యాచ్‌లు ఆడుతూనే ఉంటాను, ట్రోఫీలు గెలవడానికి నేను ఎల్లప్పుడూ ప్రయత్నిస్తాను. ధన్యవాదాలు. జై హింద్." అని ఆ వీడియోలో ఉంది. రోహిత్ శర్మ ఏప్రిల్ 30, 1987న మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో జన్మించాడు. రోహిత్ శర్మ భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్, అతని పవర్‌ఫుల్ ఫోర్లు, సిక్సర్ల కారణంగా "హిట్‌మ్యాన" అనే పేరును అభిమానులు పెట్టారు. రోహిత్ శర్మ జూన్ 23, 2007న ఐర్లాండ్‌తో జరిగిన వన్డే ద్వారా అంతర్జాతీయ క్రికెట్‌లోకి అరంగేట్రం చేశాడు. అతను సెప్టెంబర్ 19, 2007న తన తొలి T20 అంతర్జాతీయ మ్యాచ్ ఆడాడు. 2013లో టెస్ట్ అరంగేట్రం చేశాడు. గత 18 సంవత్సరాలుగా అంతర్జాతీయ క్రికెట్ ఆడుతున్న రోహిత్ శర్మ T20, టెస్ట్ ఫార్మాట్ల నుంచి రిటైర్ అయ్యాడు. 2024 టీ20 ప్రపంచ కప్ ఫైనల్లో భారత్ విజయం సాధించిన తర్వాత జూన్ 29న రోహిత్ శర్మ టీ20 ప్రపంచ కప్ నుంచి రిటైర్ అయ్యాడు. తన 159 మ్యాచ్‌ల టీ20 కెరీర్‌లో 4,231 పరుగులు చేశాడు. ఐదు సెంచరీలు, 32 హాఫ్ సెంచరీలు కూడా చేశాడు. టెస్ట్ క్రికెట్‌లో 12 సెంచరీలు, 18 హాఫ్ సెంచరీలతో 4,301 పరుగులు కూడా చేశాడు. మే 7, 2025న ఆయన టెస్ట్ క్రికెట్ నుంచి రిటైర్ అయ్యారు. రోహిత్ శర్మ నాలుగు ఐసిసి ట్రోఫీలను గెలుచుకున్నాడు. వాటిలో రెండు కెప్టెన్‌గా వచ్చాయి. అతను 2007 టి 20 ప్రపంచ కప్ గెలిచిన భారత జట్టులో భాగం. రోహిత్ 2013 ఛాంపియన్స్ ట్రోఫీని కూడా గెలుచుకున్నాడు. కెప్టెన్‌గా, అతను 2024 టి 20 ప్రపంచ కప్, 2025 ఛాంపియన్స్ ట్రోఫీని గెలుచుకున్నాడు. రోహిత్ శర్మ ఇప్పటికీ వన్డే క్రికెట్‌లో దూకుడుగా ఆడుతున్నాడు. తన 279 మ్యాచ్‌ల వన్డే కెరీర్‌లో, అతను 33 సెంచరీలు, 61 హాఫ్ సెంచరీలతో సహా 11,516 పరుగులు చేశాడు.

చిరుమూవీలో సారా అర్జున్ ?

మన శంకర వరప్రసాద్ సినిమాతో మెగాస్టార్ చిరంజీవి బ్లాక్ బస్టర్ అందుకున్న విషయం తెలిసిందే. ఈ సినిమా అనంతరం సమ్మర్‌లో అతడి విశ్వంభర చిత్రం కూడా ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. అయితే ఈ సినిమా తర్వాత బాబీతో మెగా 158 సినిమా చేయబోతున్నాడు చిరు. ఈ ప్రాజెక్ట్ గురించి ఒక ఆసక్తికరమైన వార్త ఫిలిం నగర్ వర్గాల్లో ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. ఈ చిత్రంలో చిరంజీవి కుమార్తెగా ఒక కీలక పాత్ర కోసం 'పొన్నియిన్ సెల్వన' ఫేమ్, ధురంధర్ సినిమా సారా అర్జున్ పేరును దాదాపు ఖరారు చేసినట్లు సమాచారం. ఈ పాత్ర సినిమాలో అత్యంత కీలకం కానుందని తెలుస్తుంది. అయితే దీనిగురించి త్వరలోనే అధికారిక ప్రకటన రాబోతుంది. మరోవైపు చిరంజీవి కెరీర్‌లో ఇదొక ప్రత్యేకమైన మూవీగా నిలిచిపోతుందని మెగా అభిమానులు భారీ అంచనాలు పెట్టుకున్నారు. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన ప్రీ`ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతుండగా కన్నడ నిర్మాణ సంస్థ కేవిఎన్ ప్రోడక్షన్ బ్యానర్ ఈ సినిమాను నిర్మిస్తుంది.

బైకర్‌లో రాజశేఖర్ పవర్‌ఫుల్ రోల్

ఒకప్పుడు టాలీవుడ్‌లో యాక్షన్ హీరోగా, యాంగ్రీ స్టార్‌గా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న రాజశేఖర్ కొంతకాలం విరామం తర్వాత మళ్లీ ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతున్నారు. ఈసారి హీరోగా కాకుండా పవర్‌ఫుల్ క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభించడంతో సినీ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. శర్వానంద్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న 'బైకర' సినిమాలో రాజశేఖర్ కీలక పాత్ర పోషిస్తున్నారు. బైక్ రేసింగ్ నేపథ్యంలో రూపొందుతున్న ఈ చిత్రం ఏప్రిల్ 3న విడుదలకు సిద్ధమవుతోంది.ఇప్పటికే విడుదలైన టీజర్ సినిమాపై మంచి అంచనాలు తీసుకురాగా, తాజాగా మేకర్స్ రాజశేఖర్ పాత్రకు సంబంధించిన 'బుల్లెట్ సునీల' గ్లింప్స్ విడుదల చేశారు. ఈ గ్లింప్స్‌లో రాజశేఖర్‌ను ఓ మాజీ పవర్‌ఫుల్ బైక్ రేసర్‌గా చూపిస్తూ స్టైలిష్ లుక్, గంభీరమైన ప్రెజెన్స్‌తో ఆకట్టుకున్నారు. కొన్నేళ్ల తర్వాత ఆయనను ఇంత ఎనర్జిటిక్‌గా, మాస్ షేడ్ ఉన్న పాత్రలో చూడబోతున్నామనే సంకేతాలు ఈ వీడియో ఇచ్చింది.గ్లింప్స్ విడుదలైన వెంటనే సోషల్ మీడియాలో మంచి స్పందన లభిస్తోంది. రాజశేఖర్ స్క్రీన్ ప్రెజెన్స్, బాడీ లాంగ్వేజ్, డైలాగ్ డెలివరీ మళ్లీ పాత రోజుల్ని గుర్తు చేస్తున్నాయని అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. 'ఇది రాజశేఖర్‌కు గ్యారెంటీ కంబ్యాక్ మూవీ అవుతుంది' అంటూ ఫ్యాన్స్ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా యాక్షన్ బ్యాక్‌డ్రాప్‌లో ఆయన కనిపించడమే సినిమాపై ఆసక్తిని మరింత పెంచింది. శర్వానంద్‌తో పాటు రాజశేఖర్ లాంటి సీనియర్ నటుడు కీలక పాత్రలో కనిపించడం సినిమాకు అదనపు బలం అవుతుందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. యూత్‌కు దగ్గరైన బైక్ రేసింగ్ కథతో పాటు అనుభవజ్ఞులైన నటుల ప్రెజెన్స్ ఉండటంతో 'బైకర' మూవీపై అంచనాలు క్రమంగా పెరుగుతున్నాయి.

తక్షకుడిగా వస్తున్న ఆనంద్ దేవరకొండ

యంగ్ హీరో ఆనంద్ దేవరకొండ కథానాయకుడిగా నటిస్తున్న సరికొత్త యాక్షన్ థ్రిల్లర్ 'తక్షకుడు'. గతంలో 'మిడిల్ క్లాస్ మెలోడీస' వంటి సక్సెస్‌ఫుల్ చిత్రాన్ని అందించిన దర్శకుడు వినోద్ అనంతోజు, ఆనంద్ దేవరకొండ కాంబినేషన్‌లో వస్తున్న రెండో సినిమా కావడంతో ఈ ప్రాజెక్టుపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమా టీజర్‌ను చిత్రయూనిట్ తాజాగా విడుదల చేసింది. టీజర్ చూస్తుంటే ఇది పక్కా రివెంజ్ డ్రామాగా కనిపిస్తోంది. పెళ్లయిన రోజే తన కుటుంబాన్ని కోల్పోయి, తీవ్ర గాయాలతో అడవిలో పడి ఉన్న యువకుడిని స్థానికులు కాపాడటం, ఆ తర్వాత తన పతనానికి కారణమైన వారిపై అతను తీర్చుకునే ప్రతీకారమే ఈ చిత్ర కథాంశమని అర్థమవుతోంది. ఈ సినిమాలో ఆనంద్ దేవరకొండ మునుపెన్నడూ లేని విధంగా చాలా ఇంటెన్స్ మరియు సీరియస్ లుక్‌లో కనిపిస్తున్నారు. ఆయన డైలాగ్ డెలివరీ, బాడీ లాంగ్వేజ్ ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇస్తున్నాయి. ఇక 'లాపతా లేడీస' ఫేమ్ నితాన్షీ గోయల్ ఈ చిత్రంతో తెలుగు తెరకు పరిచయం అవుతుండగా, కాలకేయ ప్రభాకర్ కీలకమైన నెగటివ్ రోల్‌లో నటిస్తున్నారు. సితార నిర్మించిన ఈ చిత్రం నేరుగా నెట్‌ఫ్లిక్స్‌లో తెలుగుతో పాటు ప్రధాన భారతీయ భాషల్లో విడుదల కానుంది. ప్రస్తుతం ఈ టీజర్ సోషల్ మీడియాలో వైరల్ అవుతూ సినిమాపై అంచనాలను పెంచుతోంది.

అవతార్ లెవల్లో వారణాసి మూవీ

పదిహేనేళ్ల క్రితం ప్లాన్ చేస్తే ఇప్పుడు కుదరింది
ఈ సినిమాలో రాముడిగా మహేశ్ బాబు కనిపిస్తారు
అత్యద్భుత దృశ్యకావ్యంగా మూవీని విడుదల చేస్తున్నాం
అంతర్జాతీయ మీడియాతో రాజమౌళి, మహేశ్ బాబు

రాజమౌళి దర్శకత్వంలో మహేశ్ బాబు హీరోగా రానున్న 'వారణాసి' ప్రస్తుతం సోషల్ మీడియాలో ట్రెండింగ్ అవుతోంది. ఎన్నో రోజుల నుంచి అప్‌డేట్స్ కోసం ఎదురుచూసిన అభిమానులకు చాలా విశేషాలు వచ్చేశాయి. చిత్ర బృందం ఓ హాలీవుడ్ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో 'వారణాసి' గురించి పంచుకుంది. దీంతో ఈ చిత్రం ఒక్కసారిగా సోషల్‌మీడియాలో ట్రెండ్ అవుతోంది. రాముడిగా మహేశ్‌బాబు కనిపించనున్నట్లు అధికారికంగా వెల్లడించారు. ఇక రాజమౌళి ఈ సినిమా నిడివితో పాటు 'అవతార'తో పోల్చడం గురించి మాట్లాడారు. నాకు ఉన్న కొన్ని కమిట్‌మెంట్‌ల కారణంగా మహేశ్‌బాబుతో సినిమా ఆలస్యం అయింది. లేదంటే 15 ఏళ్ల క్రితమే తీసేవాడిని. ఇప్పుడు వారణాసిని భారీ స్థాయిలో విడుదల చేస్తున్నాం. ప్రపంచవ్యాప్తంగా ఐమ్యాక్స్‌ల లో సందడి చేయనుంది. నేను సినిమాలు ఆలస్యం చేస్తాననే చెడ్డపేరు ఉంది. ప్రొడక్షన్ పనులు లేట్ చేస్తానని వాయిదాలు వేస్తానని అంటారు. ఈ విషయంలో నెటిజన్లు కూడా చాలా సార్లు కామెంట్స్ చేశారు. 'వారణాసి' 3.20 గంటల నిడివితో విడుదలవుతుంది. ఇంత ఎక్కువ నిడివిలో మూడు నిమిషాలు ఆసక్తిగా లేకపోయినా వెంటనే ఆడియన్స్ ఫోన్ తీసుకుంటారు. మేం అందుకే చాలా జాగ్రత్తగా ఎక్కడా బోర్ కొట్టకుండా దీన్ని రూపొందిస్తున్నాం. ప్రేక్షకుడికి ప్రతి క్షణం ఆసక్తి కలిగేలా.. కొత్త అనుభవాన్ని ఇచ్చేలా దీన్ని తీర్చిదిద్దుతున్నాం అని రాజమౌళి తెలిపారు. హాలీవుడ్ దర్శకుడు జేమ్స్ కామెరూన్ సృష్టించిన ప్రపంచం 'అవతార'తో రాజమౌళి 'వారణాసి'ని పోల్చడంపై ఆయన మాట్లాడారు. అలాంటి వ్యక్తితో పోల్చడాన్ని చాలా గౌరవంగా భావిస్తున్నా. కానీ, ఆయనతో నన్ను పోల్చొద్దు. ఆయన ఒక శిఖరం. ఆయన మాస్టర్. నేను ఇంకా విద్యార్థినే. 'వారణాసి'లో 25 నిమిషాలు పురాణాలపై చిత్రీకరించాం. ప్రేక్షకులు ఎప్పటికీ ఆ సన్నివేశాలను మర్చిపోలేరు. ప్రస్తుతం ఇంతవరకూ మాత్రమే చెప్పగలను అని దర్శకధీరుడు తెలిపారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 7న ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఇక ఈ సినిమాలో మహేశ్ బాబుతో పాటు ప్రియాంక చోప్రా కూడా ప్రధాన పాత్రలో కనిపించనున్నారు. దయచేసి నాకు ఈ సినిమాలో డ్యాన్స్ వేసే అవకాశం ఇవ్వండి. మంచి పాట ఉండేలా చూడండి' అని చెప్పాని ప్రియాంక అన్నారు. ఈ సినిమాలో వారి పాత్రల దగ్గర నుంచి కథ ఎలా మొదలైంది వరకూ మహేశ్ బాబు విశేషాలు తెలిపారు. 15 ఏళ్ల కిత్రమే రాజమౌళి దర్శకత్వంలో చేయాల్సిఉంది. ఇప్పటికి అది కుదిరింది. 'ఆరఆరఆర' పూర్తయిన తర్వాత ఏడాది పాటు దీని స్క్రిప్ట్ గురించి ఆలోచించారు. నన్ను ఆఫీసుకు పిలిచి 'వారణాసి' స్క్రిప్ట్ గురించి చెప్పారు. కథ విని ఆశ్చర్యపోయాను. ఇప్పటి వరకూ రాజమౌళి చేసిన అన్ని చిత్రాల కంటే ఇది భిన్నంగా ఉంటుంది. ఇందులో ఎన్నో అంశాలు ఉన్నాయి. యాక్షన్, అడ్వెంచర్, పురాణాలు, టైమ్ ట్రావెల్.. ఇలా ఎన్నో ఉన్నాయి. రాజమౌళి అభిమానిగా ఈ సినిమా కోసం నేనూ ఆసక్తిగా ఉన్నాను. ఇందులో హీరోగా చేయడానికి మొదట్లో భయపడ్డాను. రాజమౌళి కథను వివరించిన విధానం నా భయాన్ని పోగొట్టిందని మహేశ్ బాబు అన్నారు. 'వారణాసి'లో లుక్స్ కోసం ఎన్నో రిహార్సల్స్ చేశాం. 2024 నుంచి ఈ పనిలోనే ఉన్నాం. గతేడాది జర్మనీ కూడా వెళ్లాం. నేను ఇందులో రాముడి పాత్ర పోషించాను. రాముడు అంటేనే హుందాతనం.. ఆయనకు ప్రత్యేకమైన భంగిమ ఉంటుంది. నిలబడే విధానం దగ్గర నుంచి పాత్రలో నటించడం వరకూ ఎన్నో రిహార్సల్స్ చేశాం. 2,3 నెలలు దానికోసమే కష్టపడ్డాం. రాజమౌళి నేను పరిగెత్తే విధానాన్ని కూడా మార్చారు. దానికోసం 6 నెలలు శిక్షణ తీసుకున్నాను. సినిమాలో రెండు షాట్ల కోసం ఇదంతా చేశాం. ఆయనకు సినిమాపై ఉన్న శ్రద్ధ ఎలాంటిదో చెప్పడానికి ఈ ఒక్క విషయం చాలు. ఈ సినిమా భారీస్థాయిలో విడుదలవుతుంది. 'వారణాసి' లో విలన్ పాత్ర కోసం మలయాళ స్టార్ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్‌ను ఎంపిక చేయడం సినీ వర్గాల్లో పెద్ద చర్చకు దారి తీసింది. ఈ సినిమాలో పృథ్వీరాజ్ 'కుంభ' అనే ప్రతినాయక పాత్రలో కనిపించనున్నారు. తన కెరీర్‌లో ఇదే అత్యంత విభిన్నమైన, అంచనా వేయలేని పాత్ర అని ఆయన తెలిపారు. ఈ కుంభ క్యారెక్టర్ పూర్తిగా గ్రే షేడ్స్‌తో సాగుతుందని చెప్పారు. ఎప్పుడు ఏం చేస్తాడో ప్రేక్షకులు ఊహించలేని విధంగా ఈ పాత్రను డిజైన్ చేసినట్లు వెల్లడించారు. తన నిజజీవితానికి పూర్తిగా భిన్నమైన డార్క్ రోల్ కావడం వల్ల ఇది తనకు పెద్ద ఛాలెంజ్‌గా మారిందన్నారు. అత్యాధునిక టెక్నాలజీతో కూడిన వీల్‌చైర్, 'డాక్టర్ ఆక్టోపస' తరహాలో రోబోటిక్ చేతులు వంటి ఎలిమెంట్స్‌తో పృథ్వీరాజ్ లుక్ భయానకంగా ఉండనుందని సమాచారం. కేవలం కళ్లతోనే భయపెట్టే విధంగా ఈ పాత్రను డిజైన్ చేశారనే ప్రచారం జరుగుతోంది. భారతీయ సినిమాల్లో ఇప్పటివరకు చూడని సైకలాజికల్ విలన్‌గా 'కుంభ' నిలుస్తాడని సినీ వర్గాలు భావిస్తున్నాయి. మొత్తానికి 'వారణాసి'లో హీరో మహేష్ బాబు పోషిస్తున్న 'రుద్ర' పాత్రకు సమానంగా నిలిచే 'కుంభ' విలన్ పాత్ర సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలిచే అవకాశముంది.

బోర్డర్2 నుంచి ఘర్ కబ్ ఆవోగే సాంగ్ విడుదల

బాలీవుడ్ క్లాసిక్ వార్ డ్రామా 'బోర్డర' చిత్రానికి సీక్వెల్‌గా వచ్చిన 'బోర్డర్ 2' చిత్రం బాక్సాఫీస్ వద్ద ఘనవిజయాన్ని సాధించి సంచలనం సృష్టిస్తోంది. ఈ నేపథ్యంలో సినిమాలోని ఎమోషనల్ సాంగ్ 'ఘర్ కబ్ ఆవోగే పూర్తి స్థాయి వీడియోను చిత్రబృందం తాజాగా విడుదల చేసింది. 1997 నాటి ఐకానిక్ పాటను పునర్నిర్మించిన ఈ వెర్షన్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ పాటను ఒరిజినల్ గాయకులు సోనూ నిగమ్, రూప్ కుమార్ రాథోడ్‌లతో కలిసి నేటి తరం గాయకులు అర్జిత్ సింగ్, విశాల్ మిశ్రా, దిల్జీత్ దోసాంజ్ అద్భుతంగా ఆలపించారు. అను మాలిక్ స్వరపరిచిన ఒరిజినల్ ట్యూన్‌కు సంగీత దర్శకుడు మిథూన్ సరికొత్త హంగులు అద్దారు. దాదాపు 10 నిమిషాల నిడివి గల ఈ వీడియో సాంగ్‌లో సన్నీ డియోల్, వరుణ్ ధావన్, దిల్జీత్ దోసాంజ్ మరియు అహన్ శెట్టి సైనికుల భావోద్వేగాలను, వారి త్యాగాలను కళ్ళకు కట్టినట్లు చూపించారు. 1971 భారత్` పాక్ యుద్ధ నేపథ్యంలో అనురాగ్ సింగ్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం జనవరి 23, 2026న విడుదలై ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటోంది.

ప్రేమలు సీక్వెల్ ఆగిపోలేదు

మలయాళ సెన్సేషనల్ హిట్ 'ప్రేమలు' చిత్రానికి సీక్వెల్ రాబోతున్న విషయం తెలిసిందే. 'ప్రేమలు 2' అంటూ ఈ సీక్వెల్ రాబోతుండగా.. తాజాగా ఈ ప్రాజెక్ట్ రద్దయిందంటూ వార్తలు వస్తున్నాయి. అయితే ఈ వార్తలపై చిత్రబృందం తాజాగా స్పందిస్తూ.. ఈ ప్రాజెక్ట్ పూర్తిగా నిలిచిపోలేదని కేవలం తాత్కాలికంగా వాయిదా పడిందని స్పష్టం చేసింది. 2024 ఏప్రిల్‌లో ఎంతో గ్రాండ్‌గా ప్రకటించిన ఈ సీక్వెల్‌ను 2025లో ఏడాది విడుదల చేయాలని మేకర్స్ భావించినప్పటికీ, ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా ఇది 2026 సమ్మర్‌కి పోస్ట్‌పోన్ అయ్యే అవకాశం కనిపిస్తుంది. మరోవైపు చిత్ర దర్శకుడు గిరీష్ ప్రస్తుతం మమితా బైజు, నివిన్ పాలీలతో కలిసి 'బెత్లెహెం కుటుంబ యూనిట' అనే మరో ప్రాజెక్ట్‌లో బిజీగా ఉండటం కూడా ఒక కారణమని తెలుస్తుంది. తెలుగులో ఎస్.ఎస్. కార్తికేయ ఈ చిత్రాన్ని విడుదల చేసేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ, చిత్ర నిర్మాణ సంస్థ 'భావన స్టూడియోస' నుండి ఈ పుకార్లపై ఇంకా ఎలాంటి అధికారిక స్పందన రాలేదు.

PUBLISHED BY G.KALPANA AND PRINTED AT YAGNA PRINTERS AND PUBLICATIONS, H.NO 18-105/4, OPP HANUMANPET, MALKAJGIRI(M)MEDCHAL- 500047, MEDCHAL MALKAJGIRI DISTRICT,TELANGANA PUBLISHED FROM H.NO02-66/254,MALLAREDDY NAGAR PHASE 1, GAJULARAMARAM, QUTHBULLAPUR, MEDCHAL-500055, DISTRICT MALKAJGIRI ,TELANGANA, EDITOR : G.DAYAKAR REDDY , RNI :TELTEL/2022/83927, PHONE NUMBER 9908293393,040- 45046154